ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 23 ఏప్రిల్ 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 43.0 27.0

ఫలితం మెరుగు..
ర్యాంకు తరుగు..!

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగినా.. ఈ సారి రాష్ట్రంలో జిల్లా స్థానం దిగజారింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 30,893 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. వీరిలో 25,003 మంది పాసయ్యారు. 80.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 24వ స్థానం దక్కింది. పరీక్షల ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ సోమవారం విజయవాడలో విడుదల చేశారు. మార్చి 18 నుంచి 31వ తేదీ వరకూ పది పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణులైనవారిలో ఏకంగా 18,432 మంది ఫస్ట్‌క్లాస్ సాధించారు. సెకెండ్ క్లాస్ 4,100 మంది, థర్డ్ క్లాస్‌లో 2,471 మంది సాధించారు. 5,890 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. 19.07 శాతం ఫెయిల్యూర్ నమోదైంది. 2022-23 విద్యా సంవత్సరంలో 66.25 శాతం మంది పాస్ కాగా, జిల్లాకు 20వ స్థానం దక్కింది. కానీ ఈసారి 80.93 శాతం మంది పాసైనా.. 24వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

– అనంతపురం విద్య

పరీక్షలు రాసినవారు	: 30,893 మంది
పాసైనవారు	: 25,003 మంది
ఫస్ట్ క్లాస్	: 18,432 మంది
సెకెండ్ క్లాస్	: 4,100 మంది
థర్డ్ క్లాస్	: 2,471 మంది



అనంతలో తొలిరోజు పరీక్ష సందర్భంగా...(ఫైల్)

పదో తరగతి పరీక్షల్లో 80.93 శాతం ఉత్తీర్ణత

రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 24వ స్థానం
గత ఏడాది 66.25 శాతం ఉత్తీర్ణతతో 20వ స్థానం



బాలికలదే పైచేయి

జిల్లా వ్యాప్తంగా 15,017 మంది బాలికలు పరీక్షలు రాయగా 12,766 మంది పాసయ్యారు. బాలురు 15,876 మంది పరీక్షలు రాయగా 12,237 మంది పాసయ్యారు. బాలికలు 85.01 శాతం, బాలురు 77.08 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 29,666 మంది పరీక్షలకు హాజరు కాగా 19,654 మంది పాసయ్యారు. పాసైన వారిలో బాలికలు 10,060 మంది, బాలురు 9,594 మంది ఉన్నారు. గత ఏడాది బాలికలు 70.06 శాతం, బాలురు 62.68 శాతం పాసయ్యారు.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు వచ్చే నెల 24 నుంచి జూన్ 6వ తేదీ వరకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో 5,890 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరు ఈ నెల 23వ తేదీ నుంచే.. అంటే మంగళవారం నుంచే పరీక్షల ఫీజు చెల్లించవచ్చు. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షల ఫీజులు చెల్లించవచ్చును. రూ.50 అపరాధ రుసుముతో మే 1వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు.

నాలుగు రోజుల తర్వాత మార్కుల జాబితాలు

పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు ఇబ్బంది లేకుండా నాలుగు రోజుల్లోనే మార్కుల జాబితాలు అందుబాటులో ఉంచుతామని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. ఫలితాలు వచ్చిన 4రోజుల తర్వాత www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాలు అందుబాటులో ఉంచనుంది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ లాగిన్ నుంచి మార్కుల జాబితాలు, వ్యక్తిగత షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థులు స్కూల్‌కు వెళ్లకుండా www.results.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి కూడా షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



నేటి నుంచి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్..

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో మంగళవారం నుంచి అప్లై చేసుకోవచ్చు. ఈ నెల 30వ తేదీ రాత్రి 11 గంటల వరకూ దీనికి అవకాశం ఇచ్చారు. విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు పొంది, అక్కడే ఫీజులు చెల్లించాలి. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది.

గగనకు 596 మార్కులు

యల్లనూరు మండలానికి చెందిన నాదెండ్ల గగన 10వ తరగతి పరీక్షల్లో 596 మార్కులు సాధించింది. రాష్ట్రంలో మూడో ర్యాంకుతో సత్తా చాటుకుంది. బుక్కాపురం గ్రామానికి చెందిన నాదెండ్ల శంకర్‌నాయుడు, నిర్మల దంపతుల కూతురు గగన, తాడిపత్రిలోని పద్మవాణి పాఠశాలలో 10వ తరగతి చదివింది. గణితంలో వందకు వంద మార్కులు, మిగిలిన సబ్జెక్టుల్లో 100కు 99 మార్కులు సాధించింది. మైక్రో సాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల బంధువులు వీరు. ఎంఈఓ చంద్రశేఖర్ గగనను అభినందించారు. తల్లిదండ్రులు తమ కుమార్తెకు స్వీటు తినిపించి ఆనందం పంచుకున్నారు.

– యల్లనూరు



గగనకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

మార్కుల పంట

- ప్రణతికి రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు
- 600 మార్కులకు ఏకంగా 598
- మరికొందరికి 596, 595, 594 మార్కులు

ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టిన రవి శాస్త్రి, యువరాజ్ సింగ్‌ను తలపించేలా.. జిల్లా విద్యార్థులు పదో తరగతిలో దాదాపు 600 మార్కును టచ్ చేశారు. రాష్ట్రస్థాయి ర్యాంకులతో సత్తా చాటుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ప్రణతి ఏకంగా 598 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయి రెండో ర్యాంకును సొంతం చేసుకుంది. మరికొందరు విద్యార్థులు 596, 595, 594 మార్కులు సాధించారు. కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో పోటీ పడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించారు.

ప్రణతి.. 598



పెనుకొండ మండలం చిన్నరెడ్డిపల్లికి చెందిన తన్నేరు ప్రణతి పదో తరగతిలో 598 మార్కులు సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన సత్యనారాయణరెడ్డి, హేమావతి దంపతుల కూతురు ప్రణతి. అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో చదివింది. ఫస్ట్ లాంగ్వేజ్‌లో 100, సెకెండ్ లాంగ్వేజ్‌లో 99, థర్డ్ లాంగ్వేజ్‌లో 100, గణితంలో 100, సైన్స్‌లో 99, సోషల్‌లో 100 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన తన కూతురు ఐఏఎస్ అధికారి కావాలని అనుకుంటోందని, ఆ దిశగా ప్రోత్సహిస్తామని ప్రణతి తండ్రి సత్యనారాయణరెడ్డి తెలిపారు.

గురుకుల విద్యార్థిని సత్తా



గుడిబండలోని ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని గోసుల గోపిక 596 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు రమేష్, అనూష. వీళ్లది ఆత్మకూరు వద్ద ఉన్న తలూపూరు. కదిరేపల్లి వద్ద ఉన్న సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కేంద్రంలో పరీక్షలు రాసింది. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులను ఢీకొట్టి సత్తా చాటుకుంది.

దూసుకొచ్చిన విద్యార్థులు

జిల్లాలో పలువురు విద్యార్థులు 596 మార్కులు సాధించారు. అనంతపురం నగరంలోని ప్రసాద్ స్కూల్ విద్యార్థి ఫయాజ్ అహ్మద్ 596 మార్కులు సాధించాడు. విశ్వభారతి స్కూల్ విద్యార్థి లక్ష్యసంహిత 595 మార్కులు సాధించింది. ప్రసాద్ స్కూల్ చెందిన తనన్యలక్ష్మి 594 మార్కులు, లక్ష్మీ సినర్జీ స్కూల్ విద్యార్థిని జాహ్నవి 594 మార్కులు, ప్రహల్య 593 మార్కులు సాధించారు.



ఫయాజ్ అహ్మద్



లక్ష్యసంహిత



తనన్యలక్ష్మి



జహ్నవి

శారదా టాప్ స్కోర్స్

అనంతపురంలోని శారద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు యోషిత 592 మార్కులు, ఫిరోజ్ 591 మార్కులు సాధించారు. మున్సిపల్ స్కూల్ విద్యార్థులు ఈ స్థాయి మార్కులు సాధించడం పట్ల ఉపాధ్యాయులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.



యోషిత



ఫిర్దోజ్



మైత్రి 595 మార్కులు (రాయదుర్గం)

నామినేషన్ల జోరు

ఎంపీ స్థానానికి ఆరుగురు.. ఎమ్మెల్యే స్థానాలకు 49 మంది..

టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా నామినేషన్.. రాయదుర్గంలో కాలవ, గుంతకల్లులో జయరాం..కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు..

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22: జిల్లాలో సోమవారం నామినేషన్ల జోరు పెరిగింది. మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉండటంతో మంచి ముహూర్తం చూసుకుని నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎంపీ స్థానానికి పది, అసెంబ్లీ స్థానాలకు 65 నామినేషన్లు దాఖలయ్యాయి. కానీ సోమవారం ఒకే రోజు ఎంపీ స్థానానికి ఆరుగురు, 14 అసెంబ్లీ స్థానాలకు 27 మంది నామినేషన్ దాఖలు చేశారు.

- అనంతపురం పార్లమెంటు స్థానానికి ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ తన నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్‌కు అందజేశారు. వైసీపీ అభ్యర్థి శంకరనారాయణ, ఆయన సోదరుడు మాలగుండ్ల రవీంద్ర నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్రులుగా వడ్ల కేశవయ్య, జీవీ రమణారెడ్డి, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ తరఫున చిన్న వెంకటసుబ్బయ్య నామినేషన్ దాఖలు చేశారు.
- కళ్యాణదుర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు నామినేషన్ వేశారు. ఆయన తరఫున ఆయన భార్య రమాదేవి మరో నామినేషన్ వేశారు.
- ఉరవకొండలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. తనపై ఒక క్రిమినల్ కేసు ఉందని, గతంలో రెండు కేసుల్లో శిక్ష పడిందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.
- తాడిపత్రిలో వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డి తరఫున కంచం రాంమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి రమాదేవి నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ తరఫున నాగసుబ్బరాయుడు, స్వతంత్రులుగా సోమశేఖర్‌నాయుడు, రాంమోహన్, నాగరాజు, బింగి ప్రసాద్, కాంగ్రెస్ తరఫున గుజ్జల నాగిరెడ్డి నామినేషన్ వేశారు.
- శింగనమలలో వైసీపీ తరఫున ఎం.చిన్న పెద్దన్న, జైభీంపార్టీ తరఫున ఆనంద్ కుమార్, ఆల్ ఇండియా ప్రజాసేవ హక్కుల పోరాట సమితి పార్టీ తరఫున మాధవ్, స్వతంత్రుడిగా దండువారిపల్లి రామాంజినేయులు నామినేషన్ వేశారు.
- రాప్తాడులో స్వతంత్రులు సాకే రాజేష్‌కుమార్, రవికుమార్, బీఎస్పీ తరఫున పెద్ద మల్లప్ప నామినేషన్ వేశారు.
- రాయదుర్గంలో టీడీపీ తరఫున కాలవ శ్రీనివాసులు, వైసీపీ తరఫున మెట్టు గోవిందరెడ్డిల నామినేషన్లు దాఖలు చేశారు.
- గుంతకల్లులో వైసీపీ తరఫున వెంకటరామిరెడ్డి సతీమణి వై.శారద, కాంగ్రెస్ తరఫున దౌల్తాపురం కె.ప్రభాకర్, బీఎస్పీ తరఫున షేక్ అబ్దుల్ మాలిక్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ఆరుణమ్మ నామినేషన్ వేశారు.
- అనంతపురం అర్బన్‌లో వైసీపీ అభ్యర్థి అనంత వెంకట్రామిరెడ్డి వేర్వేరుగా 2 సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండ్ అభ్యర్థిగా షేక్ మసూద్‌వలి నామినేషన్ దాఖలు చేశారు. సీపీఐ అభ్యర్థిగా జాఫర్ తరుపున సిరిగిరి నారాయణస్వామి నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ పత్రాలను కలెక్టరుకు అందజేస్తున్న అంబికా లక్ష్మీనారాయణ



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న అమిలినేని సురేంద్రబాబు



నామినేషన్ సమర్పిస్తున్న కాలవ విజయలక్ష్మి

జయరాం నామినేషన్

గుంతకల్లులో టీడీపీ తరఫున గుమ్మనూరు జయరాం అట్టహాసంగా నామినేషన్ వేశారు. పాత గుంతకల్లు నుంచి వేలాది మంది నాయకులు, కార్యర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మస్తాన్ వలి దర్గాలో పూజలు నిర్వహించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు, నాయకులు శ్రీనాథ్‌గౌడు, వెంకట శివుడుయాదవ్ ర్యాలీలో పాల్గొన్నారు.



నామినేషన్ సందర్భంగా గుంతకల్లులో భారీ ర్యాలీ



నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న గుమ్మనూరు జయరాం

బీసీ సంక్షేమం.. టాప్

ప్రభుత్వ పాఠశాలలు అధమం.. పది ఫలితాల్లో అనంత డివిజన్ పైచేయి

అనంతపురం విద్య, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో బీసీ సంక్షేమ పాఠశాలల విద్యార్థులు 98.53 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో అగ్రస్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 66.15 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచారు. బీసీ వెల్ఫేర్ స్కూళ్లలో 273 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 269 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1,935 మంది విద్యార్థులకుగానూ 1280 మంది పాసయ్యారు. ఎస్సీ వెల్ఫేర్ స్కూళ్ల విద్యార్థులు 660 మందికిగాను 638 మంది పాసై.. 96.36 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మైనార్టీ వెల్ఫేర్ స్కూళ్లలో 237 మందికిగాను 226 మంది పాసై.. 95.36 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. కేజీబీవీల్లో 1252 మందికిగానూ 1053 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 84.11 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 190 మందికిగాను 145 మంది పాసై.. 76.32 శాతం, ఎయిడెడ్ స్కూళ్లలో 426 మందికిగాను 324 మంది పాసై.. 76.06 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మున్సిపల్ స్కూళ్లలో 2155 మంది పరీక్షలు రాయగా 1,522 మంది విద్యార్థులు పాసై.. 70.63 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. జిల్లా పరిషత్ స్కూళ్లలో 11,453 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 7,800 మంది పాసయ్యారు. 68.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

అనంత డివిజన్ పైచేయి..

జిల్లా విద్యాశాఖలో అనంతపురం, గుత్తి డివిజన్లు ఉన్నాయి. పపది ఫలితాల్లో అనంతపురం డివిజన్ ముందంజలో ఉంది. అనంతపురం డివిజన్‌లో అన్ని మేనేజ్‌మెంట్ స్కూళ్ల పరిధిలో 15,206 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,682 మంది ఉత్తీర్ణత సాధించారు. 83.40 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గుత్తి డివిజన్ పరిధిలో అన్ని మేనేజ్‌మెంట్ల పరిధిలో 15,687 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12,321 మంది పాసై.. 78.54 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

పోలింగ్ రోజున సెలవు

జిల్లా కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీనరసయ్య

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న పోలింగ్ ఉన్నందున.. ఆ రోజు దుకాణాలు, వ్యాపార సముదాయాలు సెలవు పాటించాలని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ లక్ష్మీనరసయ్య సోమవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం సూచనలతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మే 13న సెలవు ఇవ్వడంతోపాటు ఆ రోజుకు సంబంధించి వేతనం కూడా మంజూరు చేయాలని సూచించారు. ఈ నిబంధనలను పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉల్లంఘన.. స్వామి భక్తి..!





తహసీల్దారు కార్యాలయం ఆవరణలోకి చొచ్చుకొస్తున్న కార్యకర్తలు, జడ్జీ చాంబర్ సమీపంలో జెండాలతో వైసీపీ కార్యకర్తలు

వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి నామినేషన్ ప్రక్రియలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నా.. బేఖాతరు చేశారు. పరిమితి దాటి, పార్టీ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి నామినేషన్ వేసేందుకు తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లగా.. అక్కడికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. రహదారి పక్కన కట్టిన బారికేడ్లను తొలగించి లోపలికి వెళ్లారు. వందల సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు లోపలికి వచ్చినా పోలీసులు పట్టనట్లు వ్యవహరించారు. వారిని ఏమీ అనకుండా స్వామి భక్తిని చాటుకున్నారు. నాయకులు, కార్యకర్తలు ఏకంగా జడ్జీ చాంబర్ వరకూ వెళ్లారు. ఈ విషయం గురించి ఎంసీసీ అధికారులను వివరణ కోరగా, రెండో బారికేడ్ నుంచి 100 మీటర్ల వరకూ నిబంధనలు వర్తిస్తాయని చెప్పడం కొసమెరుపు. – ఉరవకొండ

టీడీపీ కార్యకర్తపై దాడి





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవిందు, ధ్వంసమైన ద్విచక్రవాహనం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 22: మండల పరిధిలోని వెంకటంపల్లిలో టీడీపీ కార్యకర్త గోవిందుపై వైసీపీ నాయకులు సోమవారం దాడి చేశారు. టీ స్టాల్ వద్ద ఉన్న తనపై వైసీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి అనూహ్యంగా కర్రలతో దాడి చేశారని బాధితుడు తెలిపాడు. తనను కులం పేరుతూ దూషించారని, బైకును ధ్వంసం చేశారని వాపోయాడు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ప్రచారానికి గ్రామంలోకి వస్తున్న సమయంలో ఈ దాడి జరిగిందని టీడీపీ నాయకులు తెలిపారు. గాయపడిన గోవిందును చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోండి..!

పోస్టల్ బ్యాలెట్ వందశాతం నమోదు కావాలి
జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22: ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, ఏ ఒక్కరూ నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. నోడల్ అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే పరిశీలించి, గంటలోపే పరిష్కరించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని రాజకీయ పార్టీలు లిఖిత పూర్వకంగా అడిగితే.. ఆ డేటాను ఇవ్వాలని సూచించారు. ఆర్వోలు తమ పరిధిలో ఉన్న బృందాలను పర్యవేక్షించాలని, వాట్సాప్‌గ్రూప్ ఏర్పాటు చేసుకొని సమాచారం తెప్పించుకోవాలని ఆదేశించారు. సాధారణ కేంద్ర ఎన్నికల పరిశీలకులు త్వరలో జిల్లాకు వస్తారని, వారికి అవసరమైన సమాచారాన్ని దగ్గర ఉంచుకోవాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చూడాలని, అందరికీ అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. 33 అత్యవసరశాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకావం కల్పించారని, వందశాతం పోస్టల్ బ్యాలెట్ నమోదుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన పెంచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మస్కట్.. వేరుశనగ



అనంతపురం జిల్లా ఎన్నికల మస్కట్‌గా ఆర్ట్స్ కాలేజీ డిగ్రీ విద్యార్థి ప్రశాంత్ కుమార్ రూపొందించిన 'వేరుశనగ' ఆకృతి ఎంపికైంది. రాష్ట్రంలోనే మొట్టమొదట ఎన్నికల మస్కట్‌ను రూపొందించిన జిల్లాగా అనంతకు ఖ్యాతి దక్కిందని కలెక్టరు వినోద్ కుమార్ తెలిపారు. ఎన్నికల మస్కట్ ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 62 మస్కట్‌లు వచ్చాయి. న్యాయ నిర్ణేతలు పరిశీలించి.. వేరుశగన మస్కట్‌ను ఎంపిక చేశారు. విద్యార్థి ప్రశాంత్‌కు కలెక్టరు రూ.5 వేల బహుమతి అందజేసి అభినందించారు.

– అనంతపురం టౌన్

ఏమైతే అది కానీ..

వైసీపీ ప్రచారకర్తలుగా వలంటీర్లు
వలంటీర్ గ్రూపులను వైసీపీ గ్రూపులుగా మార్చిన వైనం
ఆయా గ్రూపుల్లో ప్రచార ఫొటోలు, వీడియోల పోస్టింగ్
ఎన్నికల నిబంధనలకు తూట్లు



ఆ గ్రూపుల్లో వలంటీర్లు చేస్తున్న మెసేజ్‌లు ఇవే

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22: ఎన్నికల వేళ వలంటీర్ల గ్రూపులన్నీ వైసీపీ ప్రచార గ్రూపులుగా మారాయి. ఇందులో అభ్యర్థుల గురించి ప్రచారం. ఆయనే గెలుస్తారని చెప్పిన అభిప్రాయాల వీడియోలను గ్రూపుల్లో పోస్టు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ప్రచారం అనంతపురం నగరంలో జరుగుతోంది. చాపకింద నీరులా వాట్సాప్ గ్రూపుల్లో తరచూ మెసేజ్‌లు చేస్తూ వైసీపీ అభ్యర్థి అనంతవెంకటరామిరెడ్డి అనుచరులకంటే దారుణంగా పనిచేస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి రాజకీయ నాయకులకు సహకరించకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చినా వలంటీర్లు వాటిని పెడచెవిన పెడుతున్నారు. మొదట్లో 50 ఇళ్లకు సంబంధించిన కుటుంబసభ్యులను ఒక గ్రూప్‌గా చేర్చి, అందులో వలంటీరు, సచివాలయ అడ్మిన్ ఉండేలా చేశారు. ప్రస్తుతం ఆ గ్రూపులోనే ఇలాంటి మెసేజ్‌లు, వీడియోలు ప్రచార రూపంలో ఊపందుకుంటున్నాయి. సోమవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్‌కు సంబంధించి విచ్చలవిడిగా ప్రచారం చేశారు.

అడ్మిన్‌లు ఏం చేస్తున్నట్లు...?

వలంటీర్లు విచ్చలవిడిగా మెసేజ్‌లు చేస్తుంటే సచివాలయ అడ్మిన్‌లు ఏం చేస్తున్నారనే అనుమానం కలుగుతోంది. అయితే అడ్మిన్ల చర్యలు సైతం వారిని మరింత ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల మేరకు అధికారిక గ్రూపుల్లో ఇలాంటి మెసేజ్‌లు చేయకూడదు. కానీ సచిలవాలయ అడ్మిన్లు వాటిని తొలగించడం లేదు. దీన్ని బట్టి చూస్తే కొందరు సచివాలయ అడ్మిన్‌లు సైతం వైసీపీ నేతలకు భరోసా ఇచ్చినట్లు కనిపిస్తోంది.

ప్రచారకర్తలుగా వలంటీర్లు

సంక్షేమ పథకాలు అందించడానికే ఉండాల్సిన వలంటీర్లు ఇప్పుడు వైసీపీ ప్రచారకర్తలుగా మారారు. అనంతపురంలో ఈ వ్యవహారం బాగా ముదిరిపోయింది. వలంటీర్లు ఇప్పుడు వైసీపీ అభ్యర్థులకు అంతరంగికులుగా మారారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించినా బేఖాతరు చేస్తున్నారు. ఒకే రోజు 18 మంది వలంటీర్లు పాల్గొన్నారు. కానీ అధికారులు ఇద్దరినే తొలగించారు. గత నెలలో వలంటీర్లే గ్రూపుల్లో వైసీపీ కార్యక్రమాలు, అభ్యర్థి గురించి ఎవరైనా గొప్పగా చెప్పిన మాటలు వీడియో రూపంలో పోస్టు చేశారు. తాజాగా నామినేషన్ ర్యాలీ, నామినేషన్ కార్యక్రమం వీడియో, ఫొటోలు గ్రూపులో మెసేజ్ చేస్తున్నారు. దీనికితోడు 50మందితోనే ఉన్న కొన్ని గ్రూపుల్లో కొత్త వారిని చేరుస్తున్నారు.



వాట్సాప్ గ్రూపులో కొత్త వారిని చేర్చేందుకు వలంటీర్లు ఇలా

పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



అడిగినా పని కల్పించని ఫీల్డ్ అసిస్టెంట్లు
ప్రచారం పట్ల ఆసక్తి...కరువు పనులపై నిర్లక్ష్యం
జిల్లాలో తగ్గిన పని దినాలు, కూలీలు
కనీస వసతులు కల్పించడంలో అశ్రద్ధ

ఉపాధికి ఎన్నికల ఫీవర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 22: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలపై ఎన్నికల ప్రభావం పడుతోంది. ఎన్నికల నేపథ్యంలో కూలీలకు ఉపాధి పనులు కల్పించడంపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పనులు కల్పించాల్సిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారపార్టీకి ప్రచార కర్తలుగా పని చేస్తున్నారు. దీంతో ఉపాధి కూలీల సంఖ్యను తగ్గించి పని భారాన్ని తగ్గించుకోవాలని మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈక్రమంలోనే బయోమెట్రిక్, ఆధార్ ఆధారిత బ్యాంకు అకౌంట్లకు వేతనాల చెల్లింపులు, ఫేసియల్ యాప్ అంటూ నిబంధనలు విధిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. జాబ్‌కార్డుల సంఖ్యను పెంచకుండా తగ్గించడంతో పాటు పనిదినాలు తగ్గించడం, దినసరి సగటు వేతనాల్లో కోతలు విధించడం వంటి చర్యలన్నీ పథకాన్ని అటకెక్కించేందుకే అనే అనుమానాలు కలిగిస్తున్నాయి. గతంలో ఈ సమయానికి 40వేలకు పైగా పనిదినాలు నమోదు అయ్యాయి. ప్రస్తుతం 20వేలలోపు ఉపాధి కూలీల పనిదినాలు నమోదవుతున్నాయి. జిల్లాలో ఉన్న 4.5లక్షల జాబ్‌కార్డులకు 100 రోజుల పనిదినాలు కల్పించాలంటే 2కోట్ల పనిదినాలు అవసరం ఉంది. అయితే జిల్లాకు ఈ ఏడాది 80లక్షలు పని దినాలు మాత్రమే కేటాయించారు. దీంతో ఉపాధి కూలీలకు పనిదినాలతో పాటు దినసరి కనీస వేతనంపై కోతలు పడే ప్రమాదం ఉంది.



అడిగినా పనులు కల్పించడంలేదు..

కరువు పని చూపించాలని ఫీల్డ్ అసిస్టెంట్, ఆఫీసర్లను అడిగినా పట్టించుకోవడం లేదు. ఏమని అడిగితే ఎన్నికలు ఉన్నాయంటూ వెళ్లిపోతున్నారు. పనులు లేక నానా అవస్థలు పడుతున్నాం. పూట గడవడమే కష్టంగా ఉంది. సేద్యం పనులు చేసుకుంటూ కూలికి పోదాం అనుకుంటే...అక్కడ కూడా పనులు లేవు. జాబ్‌కార్డు ఉంది. ఉపాధి పనులు కల్పిస్తే పనులు చేసుకుని జీవనం సాగిస్తాం.

- నారాయణమ్మ, కడవకల్లు గ్రామం, పుట్లూరు మండలం

అన్నీ కోతలే..!

ప్రతి ఏటా ఉపాధి కూలీల సంఖ్యను తగ్గిస్తూ వస్తున్నారు. 2019లో ఉమ్మడి జిల్లాలో 8.7లక్షల జాబ్ కార్డులు ఉండేవి. మొత్తం 12లక్షల మంది కూలీలు పనులు చేస్తుండేవారు. జిల్లా విభజనతో అనంత జిల్లాలో 4.5లక్షలు ఉండాలి. అయితే ప్రభుత్వం విధించిన కోతలతో ప్రస్తుతం 3.5లక్షలు జాబ్‌కార్డులు మాత్రమే ఉన్నాయి. ఇందులో 5లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరిలో 2లక్షల మందికి మాత్రమే పని కల్పిస్తున్నారు. 82రకాల పనులు ఉండగా.. వాటిలో కోతలు విధించి, ప్రస్తుతం 4రకాలు పనులు మాత్రమే కల్పిస్తున్నారు. అన్ని రాష్ట్రాల్లో ఉపాధి కూలీలకు చెల్లిస్తున్న దినసరి వేతనం కంటే జిల్లాలో అతితక్కువగా చెల్లిస్తున్నారు. హరియాణాలో అత్యధికంగా రూ.374 చెల్లిస్తుంటే...జిల్లాలో రూ.300 చెల్లిస్తున్నారు. దీనిపై కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో పనిచేసే చోట ఉపాధి కూలీలకు టెంట్లు (నీడ), మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ పాకెట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలి. అయితే ఎక్కడా ఈ వసతులు కల్పించిన దాఖలాలు లేవు.

18మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు పలువురిని టీఏసీలో పెడుతూ డ్వామా అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులో శింగనమల మండలం లోలూరు-అంజనరెడ్డి, ఆకులేడు-గంగాధర్, నాగుల గుడ్డం- భాస్కర్, చక్రాయపేట-రమణారెడ్డిలు ఉన్నారు. రాప్తాడు మండలంలో గాండ్లపర్తి- విజయశంకర్, బొమ్మేపర్తి- రమణారెడ్డిలు ఉన్నారు. కూడేరు మండలం మరుట్ల-బయ్యపురెడ్డి, డీ హీరేహాళ్ మండలం పులకుర్తి- విజయకుమార్, విడపనకల్లు మండలం-హవళిగి-మల్లికార్జున, పెద్దవడుగూరు మండలం గార్లదిన్నె-చిన్నకుళ్ళాయప్ప, చిన్నవడుగూరు- రాజ శేఖర్‌లను టీఏసీలో ఉంచారు. మరో ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.



ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలనలకు వెళ్లిన కలెక్టర్ వినోద్‌కుమార్ వద్ద తమ గోడును వెళ్లబోసుకుంటున్న ఉపాధి కూలీలు



డ్వామా కార్యాలయం



ఎన్నికల ప్రభావం పడకుండా జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పక్కా ప్రణాళికలతో పనులు కల్పించడానికి ఇప్పటికే చర్యలు చేపట్టాం. పని అడిగిన ప్రతి కూలీకి స్థానికంగానే పనులు కల్పించాలని క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ఇక వేసవిలో ఇచ్చే అలవెన్స్‌తో పాటు ఇతర వసతులు ఇవ్వడానికి టీసీఎస్ నుంచి ఎన్ఐసీ

పనులు కల్పించడానికి ప్రత్యేక ప్రణాళిక

సాఫ్ట్‌వేర్‌లోకి మార్చడంతో సమస్య ఏర్పడింది. ఇందులో ఆన్‌లైన్ ప్రత్యేక వసతులకు సంబంధించి ఆప్షన్‌ను తొలగించారు. ఇది కొంతవరకు ఉపాధి కూలీలకు నిరుత్సాహం, నష్టం కలిగించే అంశం. అయినా దినసరి కూలీని పెంచి, పనిదినాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ

గందరగోళం..!

పోస్టల్ బ్యాలెట్‌పై కొరవడిన స్పష్టత!
ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లను దూరం చేసే కుట్ర
ఫారం-12 ఇస్తున్నా అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వని అధికారులు
ఒకోసారి ఒకోలా మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారులు
అనుమానాలు వ్యక్తం చేస్తున్న 'ఎన్నికల ఉద్యోగులు'

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22: పోస్టల్ బ్యాలెట్‌పై అధికారులు ఏ విషయం చెప్పడం లేదు. ఎప్పటి వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది? దరఖాస్తులు ఎక్కడ ఇవ్వాలి? ఆ దరఖాస్తులను ఓటు ఉన్న నియోజకవర్గానికి ఎలా పంపుతారు? దరఖాస్తు చేసుకున్న ఉద్యోగికి ఎలాంటి ఆధారాలు ఇవ్వాలి వంటి విషయాలపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు గందరగోళంలో పడిపోయారు. జిల్లాలో దాదాపు 25వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పీఓ, ఏపీఓలు, ఓపీఓలుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. వీరిలో పోలీసులు కూడా ఉన్నారు. వీరందరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు. అలాగే 33 అత్యవసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కల్పించారు. ఇలాంటి సమయంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు యంత్రాంగం అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడం అనేక విమర్శలకు దారి తీ స్తోంది. అధికార వైసీపీ పట్ల ఉద్యోగ, ఉపాధ్యా య వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. దీంతో ఆ ఉద్యోగ వర్గాల ఓట్లను దూరం చేయాలనే అధికార పార్టీనేతలు కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అందుకే రిటర్నింగ్ అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ పోస్టల్ బ్యాలెట్ విషయంలో గందరగోళానికి గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

రోజుకో నిర్ణయంతో అనుమానాలకు బలం

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సేకరణ విషయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తారు. అయితే జిల్లాలో ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై సరైన నిర్ణయాలు తీసుకొని చెప్పడం లేదు. ట్రైనింగ్‌లో ఓటు ఎక్కడ ఉన్నా తాము ఉద్యోగం చేస్తున్న నియోజకవర్గ ఆర్ఓలకు పోస్టల్ బ్యాలెట్ ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకొని అందించాలని ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు సూచించారు. ఈనెల 5, 7, 14 తేదీల్లో పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. అయితే అక్కడ ముందు చెప్పిన ప్రకారం దరఖాస్తులు తీసుకోకుండా ఆ నియోజకవర్గంలో ఓటు ఉన్నవారితో మాత్రమే ఫారం-12 దరఖాస్తు తీసుకున్నారు. మిగిలిన వారిని ఎక్కడ నివాసముంటున్నారో అక్కడే ఓటుకు దరఖాస్తు ఇమ్మన్నారు. అత్యధికమంది ఓటర్లు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే ఉన్నారు. జిల్లాకేంద్రంలోని డీఆర్‌డీఏ ఆఫీస్‌లో కౌంటర్లు పెట్టి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఫారం-12 దరఖాస్తులు తీసుకున్నారు. ఓపీఓ డ్యూటీ పడిన వారు కూడా ఇక్కడే దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారికి అక్నాలెడ్జ్‌మెంటు ఇవ్వలేదు. ఇంకో వైపు శ్రీసత్యసాయి జిల్లాలో నాలుగు రోజుల కిందట ఓపీఓల డ్యూటీ ఆర్డర్లు ఇచ్చారు. అనంత జిల్లాలో మాత్రం వారం కిందట ఓపీఓల ఆర్డర్లు వచ్చాయి. ఆ ఆర్డర్లలోనే ఈనెల 15, 16 తేదీల్లో ఓటు ఉన్న నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఇచ్చారు. కానీ అందరివీ అనంతపురంలోనే తీసుకున్నారు. ఇప్పుడు శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న అనంత జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇక్కడే ఓట్లు ఉన్నాయి. వారు ఇపుడు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక తికమక పడుతున్నారు.

అక్నాలెడ్జ్‌మెంటు ఇవ్వాలి



పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తులపై ఉమ్మడి జిల్లాలో గందరగోళం కొనసాగుతోంది. రెండు జిల్లాల అధికారుల మధ్య సమన్వయలోపం వల్లే అనంత జిల్లాలో ఓరకంగా, శ్రీసత్యసాయి జిల్లాలో ఓరకంగా నిర్ణయాలు ఉంటున్నాయి. తొలుత ఆర్ఓలకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ఇపుడు అనంతపురంలో డీఆర్‌డీఏ ఆఫీస్‌లో తీసుకుంటున్నారు. మేము దరఖాస్తులు ఇస్తున్నాం, కానీ మాకు అక్నాలెడ్జ్‌మెంటు ఇవ్వడంలేదు. ఇతర జిల్లాల్లో ఇస్తున్నా ఇక్కడ అడిగితే అలాంటిదేమీ లేదంటున్నారు. గతంలో పోస్టల్ బ్యాలెట్ జాబితాలో పేర్లు మిస్ అయిన సందర్భాలు ఉన్నాయి కాబట్టే అక్నాలెడ్జ్‌మెంట్ అడుగుతున్నాం.

- కోనంకి అశోక్ కుమార్, ఏపీటీఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నిస్సహాయ స్థితిలో నోడల్ ఆఫీసర్

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ వ్యవహారాలు చూసుకోవడం కోసం కలెక్టరు ఈవిభాగానికి డీపీఓను నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈనోడల్ ఆఫీసరు నిర్ణయాలు మేరకు ఆర్ఓలు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు స్వీకరించాలి. కానీ ఇక్కడ ఆర్ఓలు తమ సొంత ఎజెండాతో వెళుతున్నారని వారి నిర్ణయాల వల్లే జిల్లాలో గందరగోళం సాగుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

28 వరకు దరఖాస్తుకు అవకాశం: కలెక్టరు

ఎన్నికల నిర్వహణ, పోలింగ్ నిర్వహణలో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఈనెల 28 వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగి పనిచేసే ప్రాంతంలోని రిటర్నింగ్ అధికారులకు ఈ ఫారం ఇవ్వాలి. శిక్షణ సమయంలో కూడా ఫారం-12 ఇవ్వొచ్చు. ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటింగ్ అవకాశం కల్పిస్తాం. వారందరు ఓటు ఉన్న నియోజకవర్గంలో మే3 నుంచి 6వతేదీ వరకు ఓటు వేస్తారు. ఇందుకోసం ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ఓటు వినియోగించుకోవచ్చు.

అన్ని నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలు ఉండాలి

అనుమానాలకు తావులేకుండా పోలింగ్‌నిర్వహణలో పాల్గొనే ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడికి ఓటు వేసేందుకు బ్యాలెట్ అవకాశం కల్పించాలి. అందరి నుంచి ఫారం-12 దరఖాస్తు తీసుకోవాలి. గతంలో మాదిరి అనంతపురంలో అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన ప్రత్యేక పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసి ఇక్కడే ఓటు వేయించాలి. నియోజకవర్గంలోను పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి, అపుడే వందశాతం పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ నమోదుకు అవకాశం ఉంటుంది. ఆదిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.



- రామాంజనేయులు, ఎస్టీయూ, జిల్లా ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి చేసే వారికే ఓటు



- నాగమునెమ్మ, జూలాకాలవ

నియోజకవర్గం అభివృద్ధి చేసే పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తా. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకుంటాం. విజన్ ఉన్నవారు గెలిస్తేనే మనకు అభివృద్ధి, సంక్షేమం దొరుకుతాయి. ఈసారి ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలి.

- శింగనమల

రచ్చకట్ట దగ్గర నిర్ణయం




- అశ్వత్థరెడ్డి, రిటైర్డ్ టీచర్, ఈస్టు నరసాపురం

ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే గ్రామానికి మంచి చేసేవారికే ఓటు వేయాలని భావించేవాళ్లం. అట్లా అనుకున్న తర్వాత గ్రామ పెద్దలు అందరు కలిసి గ్రామంలో ఓటుపై చర్చించాలని దండోరా వేసి రచ్చ కట్ట వద్దకు రమ్మనేవారు. అక్కడ అందరితో చర్చించి ఫలానా వ్యక్తికి ఓటు వేయాలని నిర్ణయం తీసుకునేవారు. ఆ తర్వాత ఏపెద్దరెడ్డి, నాయుడు, నాయకులు వచ్చిన మేము ఫలానా వారికే ఓటు వేస్తామని తెగేసి చెప్పేవారు. ఇప్పుడు ఎవరి దగ్గర వారి మాట మాట్లాడుతున్నారు. డబ్బు, మందు, బిర్యానిలకు అమ్ముడుపోయి ఓటు వేస్తున్నారు. గెలిచిన వ్యక్తిని గ్రామం అభివృద్ధి చేయమని ఇంక ఎట్ల నిలదీయగలం.

- శింగనమల

ఒక పోలింగ్ స్టేషన్‌లో 14 వందల ఓట్లే..



కదిరిఅర్బన్, ఏప్రిల్ 22: ప్రస్తుత ఎన్నికల్లో ఓ పోలింగ్ స్టేషన్‌లో 14వందల మంది మాత్రమే ఓట్లు వేసేలా ఎన్నికల సంఘం ఓటరు జాబితా రూపొందించింది. దీనికి ఓ కారణముంది. ఈవీఎం లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ ఒకదానికొకటి అనుసంధానిస్తూ పనిచేసేలా ఏర్పాటు చేస్తారు. ఈవీఎంలో ఉండే వీవీ ప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈకాగితం 15వందల స్లిప్పులను మాత్రమే ముద్రించగలుగుతుంది. 25.5 వోల్టుల సామర్థ్యం కలిగిన బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాట్‌లో ఓటు ఎవరికి పడిందనేది కనిపిస్తుంది. వీవీ ప్యాట్‌లో పొందుపరిచే థర్మల్ కాగితం స్లిప్పుల్లో 50 నుంచి వంద వరకు పోలింగ్ రోజున ఓటింగ్ ప్రారంభించడానికి ముందుగా నిర్వహించే మాక్ పోలింగ్‌కు ఉపయోగిస్తారు. 15వందల స్లిప్పుల్లో వంద మాక్ పోలింగ్‌కే అయిపోతాయి. 14వందల స్లిప్పులు మాత్రమే మిగిలి ఉంటాయి. అందుకే ప్రతి పోలింగ్ బూత్‌లో 14వందలకు మించి ఓటర్లు ఉండకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది.

అప్పుడు చెల్లని ఓట్లు... ఇప్పుడు నోటా



ధర్మవరం, ఏప్రిల్ 22: ఈవీఎంలు రాకముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగేది. బ్యాలెట్ పేపర్‌పై ఉన్న గుర్తులను సరిగా చూసుకొని ఓటరు తన ఇష్టమైన గుర్తుపై ఓటేసేవారు. అయితే నిరక్షరాస్యులు, వృద్ధులు అవగాహణ లేని కారణంగా బ్యాలెట్ పత్రంపై ఓటేసేటప్పుడు స్వస్తిక్ ముద్రను సరిగా వేసేవారు కాదు. దీంతో అలాంటి ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. ఈవీఎంలు వచ్చిన తరువాత ఇలాంటి సమస్యలేనప్పటికీ ఎన్నికల సంఘం నోటా(పైవారిలో ఎవరూ కాదు) అనే ఆప్షన్ ఇచ్చింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు ఓటేయడం ఇష్టం లేకపోతే చిట్ట చివరన ఉన్న నోటా బటన్‌పై నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.

రాష్ట్రంలో గాలినిబట్టే గుంతకల్లులో గెలుపు

టీడీపీ ఆవిర్భావం నుంచి మారని సమీకరణం

గుంతకల్లు, ఏప్రిల్ 22: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ గాలి వీస్తుందో ఆ పార్టీ అభ్యర్థే గుంతకల్లు నియోజకవర్గంలో గెలవడం ఆనవాయితీగా ఉంది. 1983లో టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచీ ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఆ పార్టీకి చెందిన అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వస్తున్నారు. ఇప్పటికి (గుత్తి, గుంతకల్లు నియోజకవర్గాలు కలిపి) తొమ్మిది సార్లు ఎన్నికలు జరగ్గా అన్నిసార్లూ ఈ నియోజకవర్గం వేవ్ కాన్‌స్టిట్యూయన్సీగా నిలిచింది. తొమ్మిది ఎన్నికల్లో ఐదుసార్లు టీడీపీ, మూడుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ గెలుపొందాయి. ఈ మేరకే గుంతకల్లులో ఆయా పార్టీల అభ్యర్థులు కూడా ఎమ్మెల్యేలు అయ్యారు. వాటి వివరాలిలా.. పై వివరాలను బట్టి ఏ పార్టీ వేవ్ ఉంటే ఆ పార్టీ అభ్యర్థే గెలుపు సాధించారని అర్థమవుతోంది.

సం.	గెలిచిన అభ్యర్థి గుత్తి నియోజకవర్గంలో	పార్టీ	అధికారం పొందిన పార్టీ
1983	పత్తి రాజగోపాల్	టీడీపీ	టీడీపీ
1985	ఎన్ గాదిలింగప్ప	టీడీపీ	టీడీపీ
1989	అరికెరి జగదీశ్	కాంగ్రెస్	కాంగ్రెస్
1994	గాదిలింగప్ప	టీడీపీ	టీడీపీ
1999	సాయినాథ్ గౌడు	టీడీపీ	టీడీపీ
2004	ఎన్ నీలావతి	కాంగ్రెస్	కాంగ్రెస్
	గుంతకల్లు నియోజకవర్గంలో..		
2009	కె మధుసూదన్ గుప్త	కాంగ్రెస్	కాంగ్రెస్
2014	ఆర్ జితేంద్రగౌడు	టీడీపీ	టీడీపీ
2019	వై వెంకట రామిరెడ్డి	వైసీపీ	వైసీపీ

తొలిసారి ఇద్దరు సిటింగ్‌ల పోరాటం

గుంతకల్లు: ఒక నియోజకవర్గంలో ఇద్దరు సిటింగ్ ఎమ్మెల్యేలు పోటీపడటం గుంతకల్లు నియోజక వర్గంలో తొలిసారి చోటుచేసుకుంటోంది. ఆలూరు ఎమ్మెల్యేగా ఉన్న గుమ్మనూరు జయరాం గుంతకల్లు టీడీపీ అభ్యర్థిగా వలస రావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గుంతకల్లులో సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వై వెంకటరామిరెడ్డిని వైసీపీ అభ్యర్థిగా, ఆయనకు ప్రత్యర్థిగా గుమ్మనూరు జయరాం బరిలో నిలిచారు. ఇద్దరిలో ఎవరు గెలిచినా ఒకరు ఎమ్మెల్యే హోదాను నిలుపుకున్నవారతారు. గత ఎన్నికల్లో ఈ ఇద్దరు నాయకులూ భారీ మెజారిటీతో గెలుపొందిన విషయం తెలిసిందే.

'శింగనమల'... సెంటిమెంట్‌కు అడ్డా..!

ఇక్కడి విజేత పార్టీకే అధికారం... 8 సార్వత్రిక ఎన్నికల్లో అదే వరుస

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 22: ఎన్నికలు వచ్చినప్పుడల్లా సెంటిమెంట్ల ప్రస్తావన ఖచ్చితంగా వస్తుంటుంది. విస్తృతంగా చూసినపుడు రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఏదో ఒక సెంటిమెంటు ఉంటుంది. సూక్ష్మంగా చూసినప్పుడు చాలా నియోజక వర్గాల్లో ఇదే వరుస ఉంటుంది. అలాంటిదే శింగనమల నియోజక వర్గ సెంటిమెంట్. శింగనమల నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుపొందుతారో.. ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది. ఏకంగా 8 సార్వత్రిక ఎన్నికల్లో ఇదే తంతు కొనసాగుతుండడంతో రాష్ట్రంలోనే సెంటిమెంట్ నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. 1978లో శింగనమల నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ అయింది. అప్పటి నుంచి ఈ నియోజకవర్గంలో గెలుపొందిన అభ్యర్థి పార్టీ అధికారంలోకి వస్తోంది. 1983లో టీడీపీ తరపున గురుమూర్తి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. 1985లో టీడీపీ తరపున కె.జయరాం ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా టీడీపీ ప్రభుతాన్ని ఏర్పాటు చేసింది. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి పి.శమంతకమణి ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. 1994లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా కె.జయరాం గెలవగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 2004, 2009 కాంగ్రెస్ నుంచి సాకే శైలజానాథ్ విజయం సాధించగా ఆ పార్టీనే అధికారంలోకి వచ్చింది. 2014లో టీడీపీ నుంచి యామినీబాల గెలవగా రాష్ట్రంలో అదే పార్టీ అధికారాన్ని కైవసం చేసుకుంది. 2019లో వైసీపీ నుంచి జొన్నలగడ్డ పద్మావతి విజయం సాధించగా అదే పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో ఏమి జరుగుతుందో చూడాలి.

మడకశిర నియోజకవర్గానికి ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేకత ఉంది. కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో తెలుగు, కన్నడ సమ్మిళితంగా ఉంటుంది. ఇక్కడి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. మడకలపల్లి మడకశిరగా మారినట్లు చరిత్ర చెబుతోంది. హేమావతిలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయం దక్షిణకాశిగా వెలుగొందుతోంది. భక్తరహళ్లిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, జిల్లడగుంటలో ఆంజనేయసామి ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు పాడి పరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వక్కసాగులో ప్రత్యేక స్థానం ఉంది. నియోజక వర్గంలో సుదీర్ఘకాలంగా సమస్యలు తాండవిస్తున్నా పాలకులు పట్టించుకోలేదు. సాగునీటి పథకం పనులు ఏళ్ల తరబడి పూర్తి కాకపోవడంతో తాగు, సాగు నీటికి జనం అవస్థలు పడుతున్నారు.

తెలుగు, కన్నడ సమ్మిళితం

నియోజకవర్గ చరిత్ర

భిన్న సంస్కృతుల మడకశిర

ఏళ్ల తరబడి వెంటాడుతున్న సమస్యలు

తాగు,సాగు నీటి కోసం ఎదురుచూపులు

బండబారిపోతున్న వేలాది ఎకరాలు

మడకశిర, ఏప్రిల్ 22 : తెలుగు, కన్నడ సమ్మిళత ప్రాంతం మడకశిర. కన్నడ సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ కన్నడ సంప్రదాయాలు ఎక్కువగా కనిపిస్తాయి. చరిత్ర ప్రకారం మడకలపల్లి నేడు మడకశిరగా మారింది. మడకశిరను మైసూరు శిర నాయకలు కట్టించారు. బీజాపూరు రాజుల దండయాత్ర వల్ల రాజ్యాన్ని కోల్పోయిన వీరికి ప్రత్యామ్నాయంగా రత్నగిరి మడకశిర ఇచ్చారు. 1520లో స్థానిక నాయకుడు రత్నగిరి సర్జప్ప రాజా అడవిని చదును చేసి ఇక్కడ గ్రామాన్ని, ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారని కథనం. మడకశిర నియోజకవర్గం 1952 లో ఏర్పడింది. నియోజకవర్గంలో 326 గ్రామాలు ఉన్నాయి. రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాలు ఉన్నాయి. అమరాపురం మండలం హేమావతిలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయం దక్షిణకాశిగా వెలుగొందుతోంది. మడకశిర మండలం భక్తరహళ్లిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంటలో వెలసిన ఆంజనేయసామి ప్రసిద్ధి చెందిన ఆలయాలు ఉన్నాయి. ఈ ప్రాంత రైతులు పాడిపరిశ్రమ, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మొదటి నుంచి ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది.


హెంజేరు సిద్దేశ్వరస్వామి

ప్రధాన సమస్యలు

మడకశిర నియోజకవర్గంలో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. సాగునీటి పథకం పనులు పూర్తి కాకపోవడంతో తాగు, సాగు నీటికి జనం అవస్థలు పడుతున్నారు. వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతినడం, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్లు అడుగంటిపోయి వేలాది ఎకరాలు బీడుగా మారి బండబారిపోతున్నాయి. తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరై పనులు 90 శాతం పూర్తయినా ఆ కాస్త పనులను కూడా ఈ ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వేసవిలో సాగు,తాగు నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నియోజకవర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు లేక పోవండతో ఈ ప్రాంత రైతులు వర్షాధారిత, బోరు, బావులు కింద పంటల సాగుచేసి జీవనం సాగిస్తున్నారు. వర్షాలు సరిగా కురవక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొంత మంది రైతులు అప్పులు బాధ తాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. హంద్రీ నీవా కాలువల ద్వారా నియోజక వర్గంలోని చెరువులన్నింటికి కృష్ణానది జలాలతో నింపి నీటి సమస్య పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటి వరకు నియోజకరవ్గంలో 5 చెరువులకే నీటిని వదిలారు. మిగతా చెరువులకు కూడా వదలాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంటలకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు పక్క రాష్ట్రాల్లోని మార్కెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులు అదనంగా పడడమే గాక ఇక్కడి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పోతోంది. లక్షలాది రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డు నిరుపయోగంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు.

● నెరవేరని నాయకుల హామీ

● 2017లో రొళ్ల మండలంలోని రత్నగిరిలో లక్ష్మీకోళ్లాపు రమ్మ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. గుడిబండ మండలం రాళ్లపల్లి వద్ద మరో రిజర్వాయర్‌కు డీపీఆర్ తయారు చేయడానికి నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయి.

● అమరాపురం, గుడిబండ మండలాల్లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు గానీ ఇంతవరకు నెరవేరలేదు.

● అగళి మండల కేంద్రంలో సామూహిక మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

● గుడిబండ మండలం రాళ్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో పాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుత వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. హంద్రీనీవా కాలువల పనులు, కల్వర్టుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గుడిబండ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల భవనాలు గత తెలుగుదేశం హయాంలో రూ.23 కోట్లు మంజూరు చేశారు. సగభాగం నిర్మించి వదిలేశారు.

● అమరాపురం మండలంలో వక్కసాగు ఎక్కువగా ఉండడంతో మార్కెట్ ఏర్పాటు చేస్తామని నాయకులు హామీలు ఇస్తున్నారేగానీ ఇంతవరకు పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వంలో వక్క మార్కెట్ కోసం స్థలం కేటాయించి రూ.3.50 కోట్లు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వం రావడంతో దానిని విస్మరించారు.

● అమరాపురం నుంచి విరుపసముద్ర కర్ణాటక సరిహద్దు వరకు 8కిలో మీటర్ల రోడ్డు తొలగించి కంకర వేశారు. రోడ్డు నిర్మించకపోవడంతో అటు వెళ్లేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు.

● మడకశిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి 10 సంవత్సరాలు దాటిపోయింది.

● ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు చేపట్టారు. 2019 నాటికి 80 శాతం పనులు పూర్తయినా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మిగిలిన పనులు నిలిచిపోయాయి.

● మడకశిర పట్టణంలో 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చి నాలుగేళ్లు దాటుతున్నా నేటికీ భవననిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

● పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్లో రూ. 5కోట్లతో సంత మార్కెట్ ఏర్పాటు చేయడానికి స్థలం చదును చేశారు. ఇప్పటి వరకు మార్కెట్ ఏర్పాటు చేయలేదు.

● మడకశిర పట్టణంలో రూ.48 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టి 75 శాతం పనులు పూర్తి చేసినా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	సిద్దనగౌడ్	ఇండిపెండెంట్	వెంకటశివమ్మ	కాంగ్రెస్	14,844
1962	బి.రుక్మిణీదేవి	కాంగ్రెస్	ఎస్.స్వామి	ఇండిపెండెంట్	9,006
1967	ఎంబీ రాజారావు	ఇండిపెండెంట్	బి.రుక్మిణీదేవి	కాంగ్రెస్	13,847
1972	ఎం.ఎల్లప్ప	కాంగ్రెస్	బి.రుక్మిణీదేవి	ఇండిపెండెంట్	13,125
1978	వై.తిమ్మారెడ్డి	కాంగ్రెస్	ఎస్.శ్రీరామరెడ్డి	జనతా	11,451
1983	వైసీ తిమ్మారెడి	కాంగ్రెస్	హెచ్‌బీ నర్సేగౌడ్	ఇండిపెండెంట్	5,604
1985	హెచ్‌బీ నర్సేగౌడ్	టీడీపీ	వైటీ ప్రభాకరరెడ్డి	కాంగ్రెస్	24,720
1989	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	హెచ్‌బీ నర్సేగౌడ్	టీడీపీ	10,728
1994	వైటీ ప్రభాకరరెడ్డి	టీడీపీ	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	6,339
1999	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	ఈరేగౌడ్	టీడీపీ	27,556
2004	ఎస్.రఘువీరారెడ్డి	కాంగ్రెస్	వైటీ ప్రభాకరరెడ్డి	టీడీపీ	15,336
2009	కె.సుధాకర్	కాంగ్రెస్	కె. ఈరన్న	టీడీపీ	10,445
2014	కె.ఈరన్న	టీడీపీ	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	14712
2018	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	కోర్టు ద్వారా ఎన్నిక		
2019	ఎం.తిప్పేస్వామి	వైసీపీ	కె.ఈరన్న	టీడీపీ	13,136

మడకశిర నియోజకవర్గంలో ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జండర్	మొత్తం
అమరాపురం	23,530	23,389	-	46,919
గుడిబండ	21,809	21,351	-	43,160
రొళ్ల	15,660	15,017	-	30,677
అగలి	13,463	13,219	-	26,682
మడకశిర రూరల్	23,357	23,074	1	46,432
మడకశిర అర్బన్	8,423	8,781	-	17,204
మొత్తం	1,06,242	1,04,831	1	2,11,074

తొలి ఎమ్మెల్యే సిద్దనగౌడ్

మడకశిర తొలి ఎమ్మెల్యే సిద్దనగౌడ్. ఈయన మడకశిర పట్టణానికి చెందిన సిద్దరామేగౌడ, దేవీరమ్మల కుమారుడు. 1894 జూన్ 15న జన్మించారు. 1975 ఆగస్టు ఆయన మృతిచెందారు. తొలిసారిగా సిద్దనగౌడ 1952లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. 1952లో సిద్దనగౌడ్‌పై కాంగ్రెస్ నుంచి మడకశిర మండలం వైబీ హళ్లి గ్రామానికి చెందిన వైసీ తిమ్మారెడ్డి సతీమణి వెంకటశివమ్మ పోటిచేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో సిద్దనగౌడకు 23,214 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి వెంకటశివమ్మకు 8,370 ఓట్లు వచ్చాయి. 14,844 ఓట్ల మెజార్టీతో సిద్దనగౌడ్ విజయం సాధించారు.


భక్తరహళ్లి నరసింహస్వామి దేవాలయం


నరసింహ స్వామి మూలవిరాట్

రాజకీయ చరిత్ర

మడకశిర నియోజకవర్గం 35,724 చదరపు కిలోమీటరు విస్తీర్ణంలో ఉంది. 1952లో మడకశిర నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు మడకశిర, రొళ్ల, గుడిబండ, అగళి, అమరాపురం ఉన్నాయి. నియోజకవర్గంలో 2,57,820 జనాభా ఉంది. 2,11,074 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,06,242 మంది, మహిళలు 1,04,831 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. 1983లో వై.తిమ్మారెడ్డి సమీప స్వతంత్ర అభ్యర్థిపై 5,604 ఓట్లతో (అత్యల్ప) మెజార్టీతోను విజయం సాధించారు. 1999లో రఘువీరారెడ్డి సమీప టీడీపీ అభ్యర్థిపై 27,566 అత్యధిక ఓట్లతో విజయం సాధించారు. మడకశిర నియోజకవర్గంలో ఇప్పటి వరకు 14సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది సార్లు, టీడీపీ మూడు సార్లు, వైసీపీ ఒకసారి, స్వతంత్ర పార్టీ అభ్యర్థి ఒకసారి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఈరేగౌడ్‌పై 27,566 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుత సీడబ్ల్యూసీ మెంబరు రఘువీరారెడ్డి మడకశిర నియోజకవర్గం నుంచి మూడుసార్లు విజయం సాధించారు.

గాలి మాటలేనా ?


సోమయాజులపల్లివద్ద మరమ్మతులకు నోచుకోని రహదారి

గాండ్లపెంట, ఏప్రిల్ 22: ఐదేళ్ల పాలనలో నాయకులు ఇచ్చిన హామీలు ఎన్నో ఉన్నాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సోమయాజుపల్లి పంచాయతీలో వేలపకుంట వయా సోమాయాజులపల్లికి రహదారి ఏర్పాటు చేశారు. గండిచెరువు నీటి ఉధృతికి రోడ్డు కొట్టుకుపోయింది. అప్పట్లో ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి పరిశీలించి వెంటనే రహదారి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చినప్పుడు కూడా పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకు కార్యచరణ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా తూపల్లి, వంకపల్లి, పోరెడ్డివారిపల్లి, ఎర్రచేనుపల్లి, బొల్లుగుట్లపల్లి, వేపలకుంటకు రాకపోకలు కొనసాగిస్తారు. భారీ వాహనాలు రావాలంటే ఇబ్బందిగా ఉంది. మరి ఈ ఎన్నికల్లో ఏమి హామీ ఇస్తారో? ఏమి పనులు చేస్తారో చూడాలి.

రెండో ఈవీఎంను ఎప్పుడు వినియోగిస్తారంటే!

మీకు తెలుసా..?



కదిరి అర్బన్, ఏప్రిల్ 22: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఒక నియోజకవర్గంలో 16మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు. ఒక ఈవీఎంలో 16మంది వివరాలు మాత్రమే రికార్డు చేసేందుకు వీలుంటుంది. అంతకన్న ఎక్కువమంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. ఉదాహరణకు 18మంది అభ్యర్థులు రంగంలో ఉంటే మొదట ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల వివరాలు, రెండో ఈవీఎంలో ఇద్దరి వివరాలు ఉంచుతారు. దీంతోపాటు ఏ పోలింగ్ కేంద్రంలో అయినా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత మధ్యలో ఈవీఎం మొరాయిస్తే అప్పటివరకు నమోదైన వివరాలు సీజ్ చేసి, రెండో ఈవీఎంను వినియోగిస్తారు.

జగనన్నా..! కాలువ ఎండిపోయింది


నంబుల పూలకుంట సమీపంలో ఎండిపోయిన హంద్రీనీవా కాలువ

నంబులపూలకుంట, ఏప్రిల్ 22: హంద్రీనీవాకాలువ ద్వారా చెరువులను నీటితో నింపి సాగు, తాగునీరు అందించి ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని అధికార పార్టీ నాయకులు ప్రగల్భాలు పలికారు. ప్రతిపక్షనేతగా జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో హంద్రీనీవా కాలువలకు మరమ్మతులు చేయించి, ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత అధికారం చేపట్టారు. పాలనాకాలం ముగుస్తున్నా కాలువలకు మరమ్మతులుచేసి నీటిని విడుదల చేయలేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే ఈకాలువల్లో నీరుంటుందే కానీ, తరువాత చుక్కనీరుండదు. ఇప్పటికే కాలువలు ముళ్లపొందలతో నిండి, నెర్రెలు బారాయి.

వారసులే లేరు

వారసత్వ రాజకీయాలకు దూరంగా కదిరి



కదిరి, ఏప్రిల్ 22: కదిరి నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంది. వారసులెవరూ ఎమ్మెల్యేగా గెలవలేదు. 1952-55లో కుటాగుళ్లకు చెందిన వేమారెడ్డి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన వారసులెవరూ తిరిగి పోటీచేయలేదు. 1962లో ఇ. గోపాల్‌నాయక్ గెలుపొందారు 1972లో సి. నారాయణరెడ్డి ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. 1975లో నిజాంవలి, 1983లో మహమ్మద్‌షాకీర్, 1985లో చెన్నూరు అబ్దుల్ రసూల్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. అయితే వీరి వారసులెవరూ తిరిగి ఎమ్మెల్యేగా పోటీ చేయలేదు. 1989లో మహమ్మద్‌షాకీర్ కాంగ్రెస్‌నుంచి గెలుపొందగా, 1994లో జొన్నా సూర్యనారాయణ టీడీపీ నుంచి గెలుపొందారు. 1999లో ఎంఎస్ పార్థసారథి గెలుపొందారు. 2004లో జొన్నా రామయ్య గెలుపొందారు. 2009లో కందికుంట వెంకటప్రసాద్ గెలుపొందారు 2014లో అత్తార్ చాంద్‌బాషా, 2019లో పీవీ సిద్ధారెడి గెలుపొందారు. వీరి వారసులెవరూ తిరిగి ఎమ్మెల్యేగా పోటీ చేయలేదు. 1952నుంచి నేటి వరకూ వరసత్వ రాజకీయాలు లేని నియోజకవర్గంగా కదిరి ప్రత్యేక గుర్తింపు పొందింది.

ఏ, బీ-ఫారాలు అంటే...

హిందూపురం: ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎక్కువగా బీ-ఫారం గురించి చర్చించుకుంటుంటారు. బీ-ఫారం దక్కినవారే ఆయా పార్టీల తరుఫున బరిలో ఉంటారు. అయితే ఏ-ఫారం అనేది కూడా ఎన్నికల్లో కీలకమైనది. ఏ పార్టీకి అభ్యర్థి అయినా నామినేషన్ దాఖలు చేసే సమయంలో బీ-ఫారం సమర్పించాల్సి ఉంటుంది. ఈ బీ-ఫారంలో అభ్యర్థి పోటీ చేస్తున్న పార్టీ, గుర్తు, అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ఆ పార్టీ అధ్యక్షుడి సంతకం వివరాలు ఉంటాయి. ఈ బీ-ఫారం సమర్పించిన తరువాతే అభ్యర్థికి పార్టీ గుర్తింపు కేటాయిస్తారు. ఇక ఏ-ఫారాన్ని ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఏ-ఫారంలో రాజకీయ పార్టీ పేరు, ఆ పార్టీ తరుఫున పోటీచేస్తున్న అభ్యర్థుల పేరు, ఎక్కడి నుంచి బరిలో ఉన్నారనేది ఉంటుంది. ఏ-ఫారం కింద మూడు చోట్ల సంబంధిత పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. ఎవరూ ఫోర్జరీ చేసేందుకు వీలులేకుండా దరఖాస్తులో మూడు చోట్ల సంతకాలు చేయిస్తారు. అందరూ బీ-ఫారం సమర్పించిన తరువాతే అభ్యర్థుల వివరాలతో కూడిన ఏ-ఫారం ఎన్నికల కమిషన్‌కు అందిస్తాం. బీ-ఫారంలో ఉన్న పేరు వివరాలు అక్కడ పార్టీ సమర్పించిన ఏ-ఫారం సరిచూసిన తరువాతే అభ్యర్థి పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ గుర్తిస్తుంది. ఒకవేళ బీ-ఫారంలో అభ్యర్థి పేరుండి ఏ-ఫారంలో అభ్యర్థి పేరు లేకపోతే అభ్యర్థి ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లుగా గుర్తించదు. అందుకే బీ-ఫారంతోపాటు ఏ-ఫారం కూడా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంటాయి.

కోటయ్యా..! నీటి సమస్య తీరేదెప్పుడయ్యా?

చిల్లవారిపల్లిలో తీవ్ర తాగునీటి సమస్య

తాడిమర్రి, ఏప్రిల్ 22: ఆ గ్రామానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులూ వస్తారు. ఎన్నికల్లో తమను గెలిపించమని ఓటర్లతో పాటు అక్కడ కొలువైన కాటకోటేశ్వరుడిని వేడుకుంటారు. దేవుడికేమో మొక్కులు చెల్లిస్తారు కానీ ఆ గ్రామస్థుల సమస్యలు మాత్రం పరిష్కరించరు. ఈ తంతు గడచిన 20 ఏళ్లగా జరుగుతూనే ఉంది కానీ సమస్యలు పరిష్కారం కాలేదు. ఇదీ తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి గ్రామ దుస్థితి. జల్‌జీవన్ మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇంటింటికి కొళాయిలు బిగించాలంటూ పథకాన్ని ప్రవేశ పెట్టి నిధులు ఇచ్చినా అది చిల్లవారిపల్లిలో అమలు కాలేదు. బత్తలపల్లి, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, ముదిగుబ్బ, తాడిమర్రి, కొత్తచెరువు మండలా లకు నీరందించే చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఈ గ్రామానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. నాయకులు ఎవరైనా ఆ దిశగా ఆలోచించి అక్కడి నుంచి నీరు ఇచ్చేందుకు ఏర్పాటు చేసి ఉంటే ఇక్కడ ఎప్పుడు నీటి సమస్య ఉండేదే కాదని గ్రామస్థులు అంటున్నారు. దాదాపు 1200 మంది ఓటర్లుగల గ్రామంలో మనుషులకే కాదు పశువులకు కూడా నీటి కరువే. ప్రభుత్వం ఏర్పాటుచేసిన బోరులో వస్తున్న నీరు గ్రామంలో ఒక మూలకు కూడా చాలడం లేదు. కాపరులు తమ గొర్రెలను కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలాల వద్దకు తీసుకెళ్లి దాహార్తి తీరుస్తున్నా రు. గ్రామానికి కిలోమీటరు దూరంలోని బాటమ్మస్వామి ఆలయంలో ఉన్న బోరుబావే మనుషులకు దిక్కువుతోంది. దీనికి సింగిల్‌పేస్ మోటారు బిగించి నీటిని ట్యాంకుకు పెడుతుండగా అక్కడికి వెళ్లి గ్రామస్థులు తెచ్చుకుంటున్నారు. ఉపాధి పనులకు వెళ్లి వస్తూనే ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా నీటి కోసం పరిగెత్తాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.



● ప్రభుత్వం నీటి సమస్యను తీర్చాలి

నీటి బిందెలను ఎత్తుకురావడం చేతకాక ఆటోల్లో తీసుకెళ్తున్నాం. బాడుగకు ఆటో తీసుకుని కిలోమీటరు దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటు న్నాం. ఈ వయస్సులో కూడా నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- వన్నక్క, చిల్లవారిపల్లి


గ్రామానికి అంతటికీ నీరందిస్తున్న బాటమ్మగుడి వద్ద ఉన్న బోరుబావి

● పశువులకు కూడా నీరివ్వలేకున్నాం..

ఎండలు మండిపోతున్న పరిస్థితులలో మూగ జీవాలకు సరైన నీటిని అందించలేకపోతున్నాం. రోజు మోటారు సైకిళ్లపై బాటమ్మగుడి వద్ద నుండి నీటిని తీసుకొస్తున్నా మనుషులకే చాలడం లేదు. పశువులకు అరకొరగా అందిస్తున్నాం.

- శివానందరెడ్డి



డిపాజిట్ దక్కడమంటే..

కొత్తచెరువు, ఏప్రిల్22: ఏ ఎన్నికలోనైనా పోటీ చేసిన అభ్యర్థికి డిపాజిట్ దక్కలేదు అంటే చిత్తుచిత్తుగా ఓడిపోయారని అర్థం. అసలు డిపాజిట్ దక్కడమంటే ఏంటో తెలుసుకుందాం. ఎన్నికలలో పోటీ చేసేవారు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కొంత డబ్బు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలలో అయితే జనరల్ కేటగిరికి చెందిన వారు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5వేలు డిపాజిట్ కింద చెల్లించాలి. ఎంపీ అభ్యర్థి అయితే రూ.25వేలు, రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులైతే రూ.12,500 చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ వేసే సమయంలో ఈ సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికలలో ఓట్లు లెక్కింపు పూర్తి అయిన తరువాత విజయం సాధించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో ఆరింట ఒకటవ వంతు 16.5 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇస్తారు. అంతకంటే తక్కువ ఓట్లు సాధించిన వారికి డిపాజిట్ సొమ్ము ఇవ్వరు.

ఎవరడిగినా.. మా ఓటు మీకే..!



ధర్మవరం, ఏప్రిల్ 22: ఎన్నికల వేళ చిత్ర, విచిత్రాలు గోచరిస్తున్నాయి. ఓటర్ల నాడి పట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఏ పార్టీ నాయకుడు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి హాజరవుతున్నారు. ఈ విషయం తెలుసుకుని అవతల పార్టీ వారు ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిస్తే వెళ్లక తప్పడంలేదు అన్నా కానీ మా ఓటు మాత్రం మీ పార్టీకే వేస్తామంటూ సమాధానం చెబుతున్నారు. దీంతో వారు ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశ్యంతోనే కొందరు ఇలా చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికే పట్టణాల్లో, గ్రామాలలో ప్రధాన పార్టీ ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈక్రమంలో ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి వారితో ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. సర్వేలు చేసేవారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే పార్టీలకేముంది ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం, అంతవరకు ఏ ఒక్క పార్టీ నేతలకు చెడ్డకాకుండా ఉండటానికే ఇలా చేస్తున్నామంటూ సమాధానాలు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22: ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సోమవారం ఖరారు చేసింది. కళ్యాణదుర్గం నియోజక వర్గానికి రాంభూపాల్‌రెడ్డి, ధర్మవరం నియోజకవర్గానికి అశ్వత్థనారాయణను ఖరారు చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ప్రకటించారు. కాగా హిందూపురం నియోజకవర్గానికి నాగరాజు స్థానంలో మహమ్మద్ హుస్సేన్ ఇనయతుల్లాను నియమించినట్లు తెలిపారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా

అనంతా.. వలసలను ఆపుకో..!
కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి


ఎన్నికల ప్రచారం చేస్తున్న దగ్గుబాటి ప్రసాద్


వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 22: అధికారంలోకి రాగానే నగరంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని కూటమి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక 7, 27, 28వ డివిజన్లల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు రమణారెడ్డి, మారుతీకుమార్ గౌడ్, సాలార్ బాషా, సరిపూటి రమణ, బుగ్గయ్య చౌదరి, నారాయణస్వామి యాదవ్, సుధాకర్‌యాదవ్, నెట్టెం బాలకృష్ణ, గుర్రం నాగభూషణం, నారాయణస్వామి, కూచి హరి, సరిపూటి శ్రీకాంత్, వెంకటస్వామి, నాగరాజు, కురబ నారాయణ స్వామి,రామాంజి, శ్రీనివాసులు, మనోహర్, పూల బాషా, బల్లా పల్లవి, గౌసియా, వసుంధర , రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు రాకుండా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన సొంత పార్టీ నాయకులను అడ్డుకోలేకపోతున్నాడని దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, నియోజకవర్గం పరిశీలకులు రమణారెడ్డిల సమక్షంలో 26వ డివిజన్ నాయకుడు మార్కెట్ దిల్లు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు, నవోదయ కాలనీలోని 50 కుటుంబాలు, చంద్రబాబుకొట్టాల నుంచి మరో వంద మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... వైసీపీ ఓటమి ఎప్పుడో ఖరారైందన్నారు.

నగరంలో విస్తృత ప్రచారం

నగరంలోని పలు డివిజన్లల్లో సోమవారం స్థానిక టీడీపీ నాయకులు విస్తృ తంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 42వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ విజయశ్రీరెడ్డి, 39వ డివిజన్‌లో బెస్త సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు చేపల హరి, 48వ డివిజన్ లో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, 43వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ సరళ, 13వ డివిజన్‌లో కురబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురబ నారాయణస్వామి ప్రచారం నిర్వహించారు.

దగ్గుబాటి సతీమణి శ్రీలక్ష్మి ప్రచారం

అనంతపురంరూరల్ : దగ్గుబాటి ప్రసాద్ సతీమణి శ్రీలక్ష్మి మండలంలోని రుద్రంపేట పంచాయతీ మదర్‌థెరిసా కాలనీ, వికలాంగుల కాలనీ, అజయ్ ఘోష్‌కాలనీ, మోత్రోదయ కాలనీలో ప్రచారం నిర్వహించారు. అలాగే ఎ.నారాయణపురం పంచాయతీ తపోవనంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్‌నాగరాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘునాథ్‌రాయల్, చెన్నారెడ్డి, పరిమి విజయబాబు పాల్గొన్నారు.


రుద్రంపేటలో దగ్గుబాటి ప్రసాద్ సతీమణి శ్రీలక్ష్మి ప్రచారం

నెలన్నరలో మంచి రోజులు

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

అనంతపురం రూరల్, ఏప్రిల్ 22: మరో నెలన్నరలో రాష్ట్రంలో రాక్షసపాలన పోయి మంచి రోజులు వస్తాయని, ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం వస్తుందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని క్రిష్ణంరెడ్డి పల్లి నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. చియ్యేడు, పూలకుంట, ఇటుకలపల్లి మీదుగా చిన్నకుంట వరకు తన ప్రచారాన్ని సాగించారు. ఆమె మాట్లాడుతూ..వైసీపీ పాలనలో సామాన్య ప్రజలు కూడా తమ పనులు చేసుకోనివ్వకుండా ఇబ్బందులు సృష్టించారన్నారు. ప్రజలు కూడా ఎవరు ఎమ్మెల్యేగా ఉంటే న్యాయం జరుగుతుందో ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు హామీలు కూడా నెరవేరుస్తామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పరిటాల కుటుంబ సభ్యుల ప్రచారం

రూరల్ మండలంలోని సిండికేట్ నగర్‌లో పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన ఉదయం, సాయంత్రం ప్రచారం నిర్వహించారు. మరో వైపు పరిటాల కుటుంబానికి చెందిన పరిటాల రవి సోదరి ఉష కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని సుందరయ్యకాలనీ, బీఎస్ఆర్ కాలనీ, సియోన్ పూరం ఆదర్శనగర్, దండోరా కాలనీలో ప్రచారం చేపట్టారు. పరిటాల శైలజా కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని ప్రజాశక్తి నగర్, బీజేపీ కాలనీలో ప్రచారం నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్, కురుగుంట పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరాయి. కనగానపల్లి మండలం గుంతపల్లి గ్రామం నుంచి 10 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు.



చియ్యేడులో ప్రచారంలో పాల్గొన పరిటాల సునీత, సిండికేట్ నగర్‌లో ప్రచారం చేస్తున్న పరిటాల జ్ఞాన

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22 : అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన సోమశేఖర్‌రెడ్డి (26) కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అయిన అతను మద్యానికి బానిస. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న అతను.. జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సోమశేఖర్‌రెడ్డి అవివాహితుడు.

టీడీపీ కార్యకర్తపై దాడి హేయం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 22 : టీడీపీ కార్యకర్త గోవిందుపై వైసీపీ నాయకుల దాడిని టీడీపీ మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, రమణారెడ్డి, రంగారెడ్డి, వెంకటరెడ్డి, చిన్నముత్యాల్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు బాధితుడ్ని పరామర్శించారు. వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ వారిపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని వైసీపీ శ్రేణులను వారు హెచ్చరించారు. పోలీసులు సంఘటనపై విచారించి దాడికి పాల్పడిన వైసీపీ వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

26న చేనేతల ఆత్మీయ సమ్మేళనం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 22 : చేనేత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న స్థానిక పద్మావతి కల్యాణ మండపం (రాజా రమణ రమేష్ థియేటర్)లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు బండి పార్థసారథి, నిమ్మల సదాశివన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఈ సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు సుంకులమ్మ జాతర

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 22 : స్థానిక ఐదో రోడ్డులోని నల్లమల సుంకులమ్మ దేవాలయంలో మంగళవారం అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఉంగరాల శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు దప్పు వాయిద్యాలు, ఉరుముల విన్యాసాల నడుమ అమ్మవారి జాతరను నిర్వహిస్తామని, సాయంత్రం 7 గంటలకు పెద్దఎత్తున అన్నదానం ఉంటుందని తెలిపారు.

టెక్నాలజీపై ఆర్టీసీ సిబ్బందికి అవగాహన

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 22 : ఆర్టీసీ బస్సుల్లో బీఈఎస్-6 టెక్నాలజీపై సోమవారం ఆర్ఎం కార్యాలయ సమావేశ మందిరంలో గ్యారేజీల సిబ్బంది, మెకానిక్ లకు అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీసీ గ్యారేజీ సిబ్బంది, మెకానిక్‌లు ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా తమ ప్రావీణ్యాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అశోక్ లేల్యాండ్ సీనియర్ సర్వీస్ ఇంజనీర్ వడివేలు, సత్యసాయి జిల్లా డీపీటీఓ మధు, అనంతపురం రీజియన్ డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డీఎం నాగభూపాల్, ఉమ్మడి జిల్లా గ్యారేజి ఇన్చార్జిలు, ఎస్‌డీఐలు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

అనంత నామినేషన్‌కు అసమ్మతి నేతల డుమ్మా

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22: వైసీపీ అభ్యర్థి అనంత వెంకట్రామిరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి అసమ్మతి సెగ తగిలింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా అనంత వెంకట్రామిరెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కీలకమైన అసమ్మతి నేతలు దూరమయ్యారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, నదీం అహ్మద్, వైవి శివారెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, రంగంపేట గోపాల్‌రెడ్డి రాలేదు. వీరితోపాటు మరి కొందరు చోటా నాయకులు, ప్రముఖ కార్యకర్తలు గైర్హాజరయ్యారు.

కమనీయం.. సీతారాముల తిరుకల్యాణం


అనంతపురంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు


శింగనమలలో మంగళ సూత్రం చూపుతున్న పండితులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 22: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సీతారాముల తిరుకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వేదికపై సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం చంద్రప్రభవాహనంపై స్వామివార్లను పుర వీధుల్లో ఊరేగించారు.

శింగనమల : శింగనమలలో ఆత్మరామస్వామి కల్యాణమండపంలో సీతారాముల కల్యాణాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించాము. ఈఓ బాబు, గ్రామపెద్దలు సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణం శ్రీరామినవమి తరువాత వచ్చే పౌర్ణమికి ఒంటిమిట్ట తరహాలో ఇక్కడ స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

పల్లె పల్లెలో వన భోజనాలు

రాప్తాడు, ఏప్రిల్ 22: మండలంలోని బండమీదపల్లి, యర్రగుంట, భోగినేపల్లి తదితర గ్రామాల్లో సోమవారం ఘనంగా వనభోజనాలు పండుగ జరుపుకున్నారు. ఉదయమే వంటా వార్పుకు అవసరమైన సామగ్రిని గంపల్లో తీసుకుని ఇళ్లకి తాళాలు వేసి పొలాలు, దొడ్డుల్లోకి వెళ్లారు. పగలంతా వంటా, వార్పు పొలాల్లో చేసుకుని సాయంత్రం బొడ్డాయికి పూజలు చేసి ఇంటి గుమ్మం దగ్గర టెంకాయ కొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో బోణాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.


భోగినేపల్లిలో గంపలతో వన భోజనానికి వెళ్తున్న మహిళలు

టీడీపీ విస్తృత ప్రచారం

గార్లదిన్నె, ఏప్రిల్ 22 : మండలం మర్తాడు గ్రామంలో మాజీ ఎంపీపీ ముంటి మడుగు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాలాక్షిలు స్థానిక నాయకులతో కలసి బండారు శ్రావణి తరుపున ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, గుర్రం ఆదినారాయణ, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు ఆవులక్రిష్ణయ్య, టీడీపీ నాయకులు సుంకన్న, గోరకాటి వెంకటేసు, ఆవుల శీనా, నరసింహారెడ్డి, జయరాం, సుబ్బయ్య, వడ్లరాము, చల్లారాజు, రామాంజి, చలపతి, మల్లికార్జున, ఆవుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని చిన్మయ్ నగర్‌లో సోమవారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇందులో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గంగలకుంట రమణ, ఉప్పర శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లను ద్రోహం చేసిన జగన్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 22 : క్రిస్టియన్లకు సీఎం జగన్ తీరని ద్రోహం చేశారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ మండిపడ్డారు. సోమవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని దగ్గుబాటి ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జగన్ క్రిస్టియన్లకు ఇచ్చిన ఆరు హామీలల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని మండిపడ్డారు. గత ఎన్నికలకు ముందు తన తల్లి విజయమ్మ, బ్రదర్ అనిల్‌తో క్రిస్టియన్లతో సమావేశాలు ఏర్పాటు చేయించి, కల్లబొల్లి మాటలతో క్రిస్టియన్ల ఓట్లు దండుకున్నాడన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క క్రిస్టియన్‌కు న్యాయం చేయలేదని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు.

మైనార్టీలకు జగన్ అన్యాయం

ముస్లిం మైనార్టీల ద్రోహి సీఎం జగన్ అని టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్ మండిపడ్డారు. సోమవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని దగ్గుబాటి ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ వర్గాలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఈ ఎన్నికల్లో ముస్లింలు అంతా ఏకమై ఓటుతో వైసీపీకి గుణపాఠం చెప్పాలని కోరారు.

జగన్‌రెడ్డి తీరుతో నాయీబ్రాహ్మణులకు అన్యాయం

నాయీబ్రాహ్మణులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీరని అన్యాయం చేశారని టీడీపీ నాయీబ్రాహ్మణుల విభాగం నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయీబ్రాహ్మణ విభాగం నాయకులు కడియాల కొండన్న, ఆనంద్, హరికృష్ణ మాట్లాడారు. తమ పార్టీ నాయకులకు కండువాలు కప్పి షోచేసే ఖర్మ తమకు పట్టలేదన్నారు. దగ్గుబాటి ప్రసాద్‌కు అనంత అర్బన్ టికెట్ ఖరారు చేసినప్పటి నుంచి వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు వస్తున్నారన్నారు. దీన్ని జీర్ణించుకోలేక అసత్యప్రచారం చేసి పబ్బం గడుపుకునేందుకు వైసీపీ నాయకులు కుట్రలు చేయడం సిగ్గు చేటన్నారు. నాయీబ్రాహ్మణులకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, రాజు, తిమ్మప్ప, మల్లికార్జున, అక్కమ్మ, వెంకటేశులు, నరసింహులు, అజయ్, ప్రసాద్, జగన్ పాల్గొన్నారు.





మినర్వా స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, మాంటిస్సోరి విద్యార్థులతో కరస్పాండెంట్, విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం, విద్యార్థులను అభినందిస్తున్న ప్రసాద్ స్కూల్ అధినేతలు, ప్రతిభచాటిన నవభారత్ స్కూల్ విద్యార్థులు

టెన్త్ ఫలితాల్లో 'అనంత' ప్రతిభ


మనోజ్ఞ 591 | కావ్య 585 | అక్షయ 582 | కున్వంత్ 581 | ఎస్‌నవ్య 580 | కే.బి. శరోన్ 580

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : పదో తరగతి ఫలితాల్లో పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. దీంతో ఆ విద్యార్థులకు స్కూళ్ల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్ల విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి ప్రత్యేకంగా అభినందించారు.

● మినార్వా స్కూల్ : నగరంలోని అశోక్ నగర్‌లో ఉన్న మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడంతో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. తమ స్కూల్ విద్యార్థులు ఖాజావలి 583 మార్కులు, విశాల 580, అల్షిన్ తాజ్ 576 , దీపిక, సాదకున్నిసా 554, నిహా 547, నికిత 542, రూప 539, దియా 539, మునిచంద్ర 532, మహబూబ్ భాష 526, మధుశ్రీ 522, రిహాన్ అలీ 512, పౌర్ణమి 509, రుత్విక్ 505, వంశీ 503 మార్కులు సాధించారని తెలిపారు.

● మాంటిస్సోరి విద్యాసంస్థలు : గుత్తిరోడ్డు, సంగమేష్ నగర్ సర్కిల్‌లోని మాంటిస్సోరి విద్యాసంస్థల విద్యార్థులు బెస్ట్ మార్కులు సాధించినట్టు కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. స్కూల్‌లో 100 శాతం ఫలితాలు సాధించామని, 96.77 శాతం విద్యార్థులు ప్రథమశ్రేణిలో పాసయ్యారన్నారు. శ్రీహర్షిణి 583 మార్కులు, సునీల్ 577, హేమశ్రీ 574, సుఫియాన్, మహేష్‌బాబు 572, లక్ష్మీచరిత, పి. రోహిత్ 570, జైబానస 569, ఎం.రోహిత్ 568, అనూష 566, హేమంత్‌రెడ్డి 566,విష్ణు 562, చరిత 560, సాయితేజ 559, అలీఅబ్బాస్ 559, గౌతమ్ విశ్వేశ్వర 558, నాగతేజశ్రీ, హాసిని 556, చరణ్ తేజరెడ్డి 554, అఖిల 553, భవిష్యత 551 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాళ్ల రమాదేవి, పద్మావతి పాల్గొన్నారు.

● శ్రీచైతన్యలో : శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. తమ విద్యార్థిని ప్రణతి 598 మార్కులు, హనీష్, యువకిషోర్‌రెడ్డి 596 మార్కులు, జస్వంత్ 995 మార్కులు, జ్ఞానిక, పరుషోత్తం, జోష్న, రెహాన్‌కు 594 మార్కులు, సృజన, గుణశేఖర్, అభిరామ్ నివాస్, భాష్వంత్‌రెడ్డి 593 మార్కులు, అశ్రిత,నందిని, నాగవర్ధిని, వేదవతి, హారిక, సద్గుణ వాస్‌కు 592 మార్కులు, సాయి మహతి, హమాన్షురెడ్డి, దినేష్, కీర్తన,తన్విక, నవీన్‌కు 590 మార్కులు వచ్చాయ న్నారు. 25 మంది విద్యార్థులకు 590కిపైగా మార్కులు వచ్చాయన్నారు. వీరిని ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లు, డీన్లు అభినందించారు.

● ప్రసాద్ స్కూల్‌లో : టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ప్రసాద్ స్కూల్ అధినేతలు నాగరాజు, ప్రసాద్, గంగాధర్ తెలిపారు. విద్యార్థులు ఫయాజ్ అహ్మద్ 596, తనన్య లక్ష్మి 594, బాలాజీ 590, అఫ్రిది 590 మార్కులు సాధించారన్నారు. 500 పైనే మార్కులను 102 మంది విద్యార్థులు సొంతం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు గాయత్రి, భారతి, ఇన్‌చార్జులు మల్లికార్జున, అనూష, ఉమాదేవి పాల్గొన్నారు.

● నవభారత్ పాఠశాల :ఆజాద్‌నగర్‌లోని నవభారత్ పాఠశాలలో మొత్తం 53 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 27 మంది 500కు పైగా మార్కులు సాధించారు. మొత్తం విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రధానంగా సాయి దర్శిని 585, లక్ష్య 577, యశ్వంత్ 569, శ్రేష్ఠ 568, మేఘన 566 మార్కులతో విజయం సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, హెచ్ఎంలు కృష్ణవేణి, అనిత ఆ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

● ప్రభుత్వ వసతిగృహాల్లో... : నార్పల బీసీ గురుకుల పాఠశాలకు చెందిన కావ్య అనే విద్యార్థి 585 మార్కులు సాధించి బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. బి. పప్పూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన కున్వంత్ అనే విద్యార్థి 581 మార్కులు, కరుగుంట బాలికల పాఠశాలకు చెందిన కె.బి. శరోన్ 580 మార్కులు సాధించి అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో తొలి, రెండో స్థానాల్లో నిలిచారు. గుత్తి నెం-1 బాలుర ఎస్సీ సంక్షేమ వసతి గృహానికి చెందిన డి. ఆసిఫ్ 570 మార్కులు సాధించి జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల్లో మొదటి స్థానంలో నిలిచాడు. రాయదుర్గం బీసీ బాలికల వసతిగృహానికి చెందిన అఖిల 560 మార్కులు సాధిం చి జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో మొదటి స్థానంలో నిలిచింది.

● చెన్నేకొత్తపల్లి మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో 452 మంది పరీక్షలు రాయగా 374 మంది ఉత్తీర్ణత (82.74 శాతం) సాధించారని ఎంఈఓ-1మున్వర్‌బాషా, ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్ నాయుడు తెలిపారు. చెన్నేకొత్తపల్లి కేజీబీవీ విద్యాలయంలో చదువుతున్న వీ.మనోజ్ఞ (591)మార్కులతో మండల టాపర్‌గా, కనుముక్కల జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన బి.అక్షయ (582), ఎస్.నవ్య (580) మార్కులు సాధించారన్నారు.

● కనగానపల్లి మండలంలోని ఆరు జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్‌స్కూల్, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు మొత్తం 302 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 260 మంది (86 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సీఎస్‌కోట పాఠశాలకు చెందిన మధుమిత 590 మార్కులు సాధించి జిల్లా స్థాయి ర్యాంకు, మండల టాపర్‌గా నిలిచింది.

● నార్పల మండలంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 80 శాతం ఉత్తీర్ణత సాధించినటు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. బీ పప్పూరు గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా.. మండల టాపర్‌గా కుశ్వంత్ 581 మార్కులు సాధించారన్నారు.

● రాప్తాడు మండలంలో పదో తరగతి ఫలితాల్లో 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి మల్లికార్జున తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 338 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 228 మంది ఉత్తీర్ణులయ్యారు. రాప్తాడు ఆదర్శ పాఠశాల విద్యార్థి బాబాసోహర్ష్ 574 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు.

● అనంతపురంరూరల్ మండలంలో పది పరీక్షలో 80.65 శాతం ఉత్తర్ణత నమోదైనట్లు ఎంఈఓ వెంకటస్వామి తెలిపారు. మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలో 522 మంది పది పరీక్షలు రాయగా.. 421 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కురుగుంటలోని డా.బీఆర్ అంబేడ్కర్ పాఠశాల విద్యార్థిని షారోన్ 580 మార్కులు సాధించిందన్నారు.

● శింగనమల మండలంలో పది పరీక్షలు 369 మంది రాయగా 293 మంది విద్యార్థులు (79శాతం) పాస్ అయ్యారు. శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో సుబీక్షరెడ్డి 577, హర్షియ అంజామ్ 571 మార్కులు సాధించారు.

● గార్లదిన్నె మండలంలో 11 ప్రభుత్వ, 3 ప్రైవేట్ పాఠశాలల్లో 584 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 348 మంది పాసైనట్లు (60 శాతం) మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్ తెలిపారు. ఇల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎరుకుల అరుణ 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా, వైష్ణవి 551 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలచింది. పెనకచెర్ల డ్యాంలో వైష్ణవి 566 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచింది.

● రామగిరి మండలంలో తొమ్మిది ఉన్నత పాఠశాలలో 456 మంది పరీక్షలు రాయగా 348 మంది (72 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మండల టాపర్‌గా నసనకోట బాలికల పాఠశాలలో భవశ్రీ(575), రూప కళకావ్య (572)తో రెండో స్థానాన్ని సాధించారు.

● ఆత్మకూరు మండలంలో 363 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.... 300 మంది ఉత్తీర్ణత (82.6 శాతం) సాధించినట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. సనప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దినేష్ కార్తీక్ 557 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారన్నారు.


నవభారత్ స్కూల్‌లో విజయకేతనం చూపుతున్న విద్యార్థులు

విద్యాదీవెనను వెంటనే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

అనంతపురం కల్చరల్ : విద్యా దీవెన విడుదల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వారాలు దాటి నెలలు గడుస్తున్నాయని, అయితే ఇప్పటికీ ఎంతో మంది విద్యార్థులు తమ ఖాతాల్లో విద్యా దీవెన సొమ్ము పడక కష్టాలె దుర్కొంటున్నారని, వెంటనే పెండింగ్ విద్యా దీవెన సొమ్మును విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన మాట్లా డారు. ఈనెల 23వ తేదీ నుంచి డిగ్రీ విద్యా ర్థులకు సెమిస్టర్ పరీక్షలు ప్రారంభ మవుతున్నాయని, విద్యాదీవెన సొమ్ము ఇప్పటికీ విడుదల కాకపోవడంతో ఫీజులు ఏరకంగా కడతారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల యాజ మాన్యాలు ఫీజులు కడితేనే హాల్‌టికెట్లు ఇస్తామంటూ విద్యార్థులను వేధిస్తున్నారని, ఇలాంటి కళాశాలలపై ఎస్కేయూ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా, పరీక్ష ఫీజు కట్టిన ప్రతి విద్యార్థికి హాల్‌టికెట్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో కళాశాలల ముందు ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు శివ, నాయకులు విజయ్, రాజేష్ పాల్గొన్నారు.

చీనీకాయల ధర..

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.35 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపా రు. మార్కెట్‌కు మొత్తంగా 586 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



భారీ జనసందోహం మధ్య జయరాం నామినేషన్


నామినేషన్ దాఖలుకు ర్యాలీగా వెళ్తున్న గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 21: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోమవారం భారీ జన సందోహం మధ్య నామినేషన్‌ను దాఖలుచేశారు. ఆదివారం విజయవాడలో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నుంచి బీఫారం తీసుకున్న గుమ్మనూరు జయరాం సోమవారం ఉదయం పాతగుంతకల్లు నుంచి భారీ ర్యాలీని నిర్వహించి నామినేషన్ వేశారు. మస్తాన్ వలి దర్గాలో పూజలు చేసిన జయరాం పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు పసుపు జెండాలను పట్టి జయజయ ధ్వనులు పలుకుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ముహూర్తాన్ని అనుసరించి మధ్యాహ్నం 12-15 గంటలకు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉండగా, రాలీ మధ్యలో ఉండగానే వచ్చేసిన జయరాం ఆర్డీవో కార్యాలయానికి వచ్చి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ప్రతాప్ నాయుడు, హేమాద్రి, గుమ్మనూరు ఈశ్వర్, శ్రీనివాసులు, నారాయణ స్వామి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నా గెలుపు తథ్యం: గుమ్మనూరు

నామినేషన్ వేసే రోజున నియోజకవర్గ కార్యకర్తలు, పట్టణ ప్రజలు తనకు బ్రహ్మరథం పట్టారని, ఎన్నికల్లో తన విజయం తథ్యమని టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం మధ్యాహ్నం నామినేషన్ వేసిన అనంతరం జయరాం విలేఖరులతో మాట్లాడారు. అశేష జనవాహిని తన ర్యాలీకి తరలి వచ్చి మద్దతు పలికిందన్నారు. అన్నివర్గాలూ తనను స్వాగతిస్తున్నాయని, ఎన్నికల్లో గెలుపు సాధిస్తానన్న ధీమా కలిగిందన్నారు.

ఐరావత వాహనంపై సంగమ్మ, సంగప్ప విహారం

కూడేరు, ఏప్రిల్ 22: వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఐరావత వాహనంపై సంగమ్మ, సంగప్పలు విహరించారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు సోమవారం జోడులింగాల సంగమేశ్వర ఆలయంలో అర్చకులు రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి వారిని ఐరావత వాహనంలో విహరించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి పదిన్నర గంటలకు భోగిశెట్టి శివానంద కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే మంగళవారం ఉదయం స్వామి వారి మడుగుతేరు, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రామదుర్గం కిష్టప్ప, కమిటీ సభ్యులు, అధికారులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

ఉరవకొండ, ఏప్రిల్ 22: పట్టణంలోని మల్లేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 22: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. రాయదుర్గం పట్టణ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆర్చి వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, డీ.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన మల్లమ్మ, తమ్ముడు వన్నూరుస్వామి వివాహ వేడుకలలో భాగంగా రాయదుర్గానికి వచ్చి తిరిగి వెళుతుండగా ఆర్చ్ మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు గమనించి 108 వాహనంలో రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుత్తిరూరల్: మండలంలోని ఊబిచేర్ల గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై సోమవారం వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నంద్యాల జిల్లా ప్యాపిలికి మండలం బోయపల్లికి చెందిన లారీ అనంతపురం నుంచి కర్నూలుకు వెళ్తుండగా ప్యాపిలికి చెందిన వెంకటేష్ క్రూజర్ వాహనంలో ఎదురుగా లారీని ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు గుర్తించి ప్యాపిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పదిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

గుంతకల్లుటౌన్,ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 18 ప్రభుత్వ పాఠశాలల్లో 1143 మంది పరీక్షలు రాయగా 791 మంది పాసయ్యారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన అభిరామ్ 574 మార్కులు సాధించారు. సాయిగీతికా 567 మార్కులు సాధించింది. ఎస్‌జేపీ హైస్కూల్‌లో హెచ్ మోహన్‌బాబు 560, సరోజినాయుడు మున్సిపల్ బాలికల పాఠశాలలో భవాని 555, రైల్వే పాఠశాల తస్లీంఖాన్ 552 మార్కులు సాధించారు. పాతకొత్తచెరువు జడ్పీపాఠశాలలో ఎన్ వేణు 557, కసాపురంలో హాసిని 538, కేజీబీవీ ఎన్ సునీతబాయి529, దీక్షిత 510, నెలగొండ పాఠశాలలో కే పవన్ 524, నాగసముద్రం పాఠశాలలో తారకేష్ 523, వైటీచెరువు బీసీ మనోజ్ 506 మార్కులు సాధించినట్లు ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు తెలిపారు.

64శాతం ఉత్తీర్ణత

విడపనకల్లు: మండలంలోని 9 ఉన్నత పాఠశాలల్లో 582 మందికి 375 మంది ఉత్తీర్ణత, 64.4 శాతం మంది పాసైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మండల టాపర్లుగా బాలికలే ఉండటం గమనర్హం. గడేకల్లు విద్యార్థిని 567 మార్కులు, ఆదర్శపాఠశాలకు చెందిన కళ్యాణలక్ష్మికి 562, గడేకల్లుకు చెందిన నేహా, వినయ్ 557 మార్కులు సాధించారు.

70 శాతం ఉత్తీర్ణత

కూడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డి 578 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడని ఎంఈఓలు చంద్రశేఖర్, సాయికృష్ణ తెలిపారు. ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతిలో 224 మంది పాస్ కాగా 95 మంది ఫెయిల్ అయినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సత్తా

ఉరవకొండ: పదో తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల వ్యాప్తం గా 987మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 657మంది విద్యార్థులు పాసయ్యారు. 66.6శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఈశ్వరయ్య తెలిపారు. బీసీ గురుకుల పాఠశాల, అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాలలోనూ 100శాతం ఉత్తీర్ణత సాధించారు. పెన్నహోబిలం బీసీ గురుకుల పాఠశాలలో సాకేవంశీ 577, ఎంసీ మన్విత్‌కుమార్ రెడ్డి 575, దిలీప్ 571 మార్కులను సాధించారు. జడ్పీ పాఠశాలలో ముజమిల్ 565, గురుకుల పాఠశాలలో జెద్దికా 559, కేజీబీవీ స్వాతి 556 మార్కులు సాధించారు. వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో లహరి 583, పీ భానుప్రకాష్ 579 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ తెలిపారు.

80శాతం ఉత్తీర్ణత

కుందుర్పి: మండల వ్యాప్తంగా 80 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 11 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, జ్యోతిబా పూలే పాఠశాలలు ఉత్తీర్ణత 551 మందికి గాను 438 మంది ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న కిరణ్ కుమార్ 571 మార్కులు సాధించారు. కుందుర్పి పాఠశాలలో మౌనిక 556, గొలపల్లి దీక్షిత్ 553 మార్కులు సాధించినట్లు ఎంఈవో తిప్పేస్వామి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా

పుట్లూరు: మండలంలోని ఐదు జడ్పీ పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శపాఠశాలల విద్యార్థులు పది ఫలితాల్లో సత్తా చాటారు. 306 మంది విద్యార్థులకు గాను 244మంది ఉత్తీర్ణత సాధించారు. 78శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. ఆదర్శ పాఠశాల విద్యార్థిని సాయికీర్తన 579, నవ్యకీర్తన 571, శ్వేత 566 మార్కులు సాధించారు.

82శాతం ఉత్తీర్ణత

గుత్తి: పదో తరగతి పరీక్షల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవినాయక్ తెలిపారు. 1410 మంది పరీక్షలు రాయగా 1158మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. గురుకుల బాలికల పాఠశాలలో వంద శాతం, వైష్ణవి 583 మార్కులు సాధించారు. కేజీబీవీ అక్షిత 558మార్కులు సాధించింది. మోడల్ పాఠశాలలో ఆశ్రిత 585, పల్లవి 573మార్కులు సాధించారు. కోటవీధిలోని జడ్పీ పాఠశాలలో హబీబా 547మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం సుభాన్ తెలిపారు.

యాడికి విద్యార్థుల ప్రతిభ

యాడికి: సోమవారం ప్రకటించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో యాడికి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. వాగ్దేవి హైస్కూల్‌కు చెందిన పవన్ అనే విద్యార్థి 589మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. భవేష్ 588మార్కులు సాధించాడు. 71.52శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.


రోడ్‌షోలో అమిలినేని సురేంద్రబాబుకు గజమాలతో స్వాగతం


రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని

కళ్యాణదుర్గాన్ని అభివృద్ధివైపు పరుగులు పెట్టిస్తా

● రోడ్‌షోలో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 22: కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తానని కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటంపల్లి, ముద్దినాయనిపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. సురేంద్రబాబుకు పూలవర్షం కురిపించి గజమాలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. అమిలినేని మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతం చాలా వెనుకబడిందని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయమన్నారు. ప్రతి గ్రామానికి తాగునీరు, మినరల్ వాటర్ ప్లాంట్లు, సీసీ రోడ్లు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగుతామన్నారు. సమస్యలు లేని పల్లెలుగా మార్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. పంచాయతీల్లో లభించే ప్రకృతి వనరులతో ఆదాయాన్ని సమకూర్చే విధంగా కృషి చేస్తామన్నారు. అందరూ ఐక్యతగా వుంటూ టీడీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పాల్గొని టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైసీపీలో సర్పంచ్‌లను కీలుబొమ్మలుగా మార్చారు: వైసీపీలో సర్పంచ్‌లను కీలుబొమ్మలుగా మార్చేశారని శెట్టూరు మండలం పెరుగుపా ల్యం సర్పంచ్ తిమ్మరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని ఆధ్వర్యంలో సర్పంచ్ తిమ్మరాజుతో పాటు వంద కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరందరికీ అమిలినేని పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు టీడీపీలోనే పెద్దపీట వేస్తారన్నారు. అందుకే ఎక్కడ చూసినా టీడీపీపై మొగ్గుచూపుతున్నారని అన్నారు. కళ్యాణదుర్గంలో టీడీ పీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

కుందుర్పి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఉమ్మడి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనుంజయ, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున, మాజీ ఎంపీపీ దీనమ్మ, పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, రాఘవేంద్ర బాబు, చిత్రలింగ పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులు ప్రతి గడపకు వెళ్లి కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబును, పార్లమెంటు అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి, నీలా స్వామి, శివలింగప్ప, బజ్జనగౌడ, జనసేన నాయకుడు రవిచంద్ర, రవీంద్ర పాల్గొన్నారు.

పామిడిలో చైన్ స్నాచింగ్

పామిడి, ఏప్రిల్ 22: పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న టీవీఎస్ షోరూం పక్కన సోమవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. పోలీసుల వివరాల మేరకు... టీవీఎస్ షోరూం పక్కన నివాసం ఉంటున్న విరోజమ్మ అనే మహిళ చిల్లర అంగడితో జీవనం సాగిస్తోంది. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఒకరు సిగరేట్ కావాలని అంగడికి వెళ్లారు. సిగరేట్ తర్వాత వాటర్ ప్యాకెట్ ఇవ్వమనడంతో వాటర్ ప్యాకెట్ ఇచ్చేందుకు వెనుదిరగగా వెంటనే మెడలోని బంగారు చైన్ లాక్కొని పరారయ్యారన్నారు. యువకులు ఇద్దరూ హెల్మెట్లు పెట్టుకొని ఉన్నట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుర్గం విద్యార్థుల ప్రతిభ

కళ్యాణదుర్గం రూరల్: పది ఫలితాల్లో కళ్యాణదుర్గం విద్యార్థులు మెరిశారు. మండలంలో 74.58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో విజయకుమారి తెలిపారు. మండల వ్యాప్తంగా 1133 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 845 మంది పాస్ అయ్యారు. ఇందులో 96 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. జడ్పీ తిమ్మాపురం హైస్కూలులో 19 మంది పరీక్షలు రాయగా 12 మంది ఉత్తీర్ణత సాధించగా ఎం గౌతమి 491 మార్కులు సాధించారు. ఏపీ ఎస్‌డబ్ల్యూహెచ్ ఆర్ఎస్ తిమ్మాపురం హైస్కూలులో 83 మంది పరీక్షలు రాయగా 67 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కే బి మానస 494 మార్కులు సాధించారు. పాళ్లూరు జెడ్పీ హైస్కూలులో 14 మంది పరీక్షలు రాయగా 11 మంది ఉత్తీర్ణత సాధించగా కే మౌనిక 507 మార్కులు సాధించింది. రాళ్ల అనంతపురం స్కూల్‌లో అభిలాష్ 516 మార్కులు సాధించారు. నూతిమడుగు జడ్పీ హైస్కూలులో వరుణ్ తేజ్ 565 మార్కులు సాధించారు. ఏపీఆర్ఎస్ పాఠశాలలో హరిచరణ్‌రెడ్డి 572, కురాకులపల్లిలో లలిత 517, కంబదూరు హైస్కూలులో ఎస్ సఫియా బాను 567 మార్కులు సాధించారు.

రాయదుర్గంలో పది విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం రూరల్: పది ఫలితాల్లో పట్టణంలో టాపర్‌గా మైత్రి 595 మార్కులు, చరిత 589, ప్రీతి, మహిత 586 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. ఏపీ మోడల్ ప్రభుత్వ పాఠశాలలో, ఏపీఆర్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలో 924 మంది విద్యార్థులకు గాను 723 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 75.25 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థిని చరిత 589, బాలగంగాధర్ తిలక్ పాఠశాలకు చెందిన వైష్ణవి 585, కళ్లిమఠం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన రవితేజ 584 మార్కులు సాధించినట్లు తెలిపారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని కొండాపురం పాఠశాలకు చెందిన వర్షిత 528 మార్కులు టాపర్‌గా నిలవగా, 74 ఉడేగోళం పాఠశాలకు చెందిన మాంతేష్ 517 మార్కులు ద్వితీయస్థానం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు.

సెయింట్ పీటర్స్ విద్యార్థుల ప్రతిభ


చిన్మయి 590 | యోచన 588 | ఫరియా ఖాన్ 587 | లయిస్ లక్షిత 580 | సాహిత్య బాయి 577

గుంతకల్లుటౌన్,ఏప్రిల్ 22: పదిఫలితాల్లో సెయింట్ పీటర్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ చాకోచాన్ తెలిపారు. చిన్మయి 590, యోచన 588, ఫరియాఖాన్ 587, లయిస్ లక్షిత 580, సాహిత్యబాయి 577 మార్కులు సాధించారు. 100శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులకు కరస్పాండెంట్, హెడ్మాస్టర్ రాజేష్ అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలల హవా


గగనను అభినందిస్తున్న కరస్పాండెంట్ నాగపీరయ్య

తాడిపత్రి టౌన్: పది ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హవా కొనసాగించారు. పట్టణంలోని పద్మవాణి పాఠశాలకు చెందిన విద్యార్థిని గగన 596 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచినట్లు కరస్పాండెంట్ నాగపీరయ్య తెలిపారు. అక్షయ 591, లక్ష్మి సుదీశ 593, మధులత 592, విష్ణుప్రియ 591మార్కులు సాధించినట్లు విద్యాసంస్థల ఛైర్మన్ గంగాధర్ తెలిపారు. 192మంది విద్యార్థులకు గాను 190మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. సాయివిజేత పాఠశాలకు చెందిన విద్యార్థులు 590మార్కులకు పైబడి నలుగురు సాధించారని కరస్పాండెంట్ పవన్‌కుమార్ తెలిపారు. టార్గెట్ పాఠశాలకు చెందిన విద్యార్థిని అశ్మిత 594మార్కులు సాధించిందని కరస్పాండెంట్ జయచంద్ర తెలిపారు. నారాయణ కాన్సెప్ట్ పాఠశాలకు చెందిన శ్రీనిధి 589మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా తెలిపారు. సర్‌విశ్వేశ్వరయ్య పాఠశాలకు చెందిన విద్యార్థి నవీన్‌కుమార్‌రెడ్డి, పవిత్రలు 578మార్కులు సాధించారని కరస్పాండెంట్ రవిప్రకాష్ తెలిపారు. ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రణీత 575, హేమంత్‌కుమార్‌రెడ్డి 564మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. శివశంకర్ పాఠశాలకు చెందిన పదవతరగతి విద్యార్థిని త్రివేణి 564, రంజిత్‌కుమార్ 561మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ సత్య తెలిపారు. ప్రగతి స్కూల్ విద్యార్థి సానియా 567, ఈశ్వర్ 548మార్కులు సాధించారని కరస్పాండెంట్ వలి తెలిపారు. పట్టణంలోని విజయనగర్‌కాలనీలో ఉన్న బాయ్స్‌హైస్కూల్‌కు విద్యార్థులు హర్షవర్ధన్ 556, కరిష్మ 541, జాస్మిన్ 539మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కేజీబీవీ విద్యార్థిని మంజుల 567మార్కులు సాధించిందని ఎస్‌ఓ పద్మావతి తెలిపారు.


లక్ష్మీసుదీశ | మధులత | అశ్మిత | నవీన్‌కుమార్‌రెడ్డి

తండ్రి గెలుపు కోసం కుమార్తె ప్రచారం


గోవిందవాడలో ప్రచారం చేస్తున్న కాలవ గౌతమి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 22: టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు కుమార్తె కాలవ గౌతమి తండ్రి గెలుపు కోసం మండలంలోని గోవిందవాడ గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. కాలవ శ్రీనివాసులును ఈ సారి గెలిపిస్తే రాయదుర్గం నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, బలరాంరెడ్డి, మల్లికార్జున, కుమ్మరి మల్లికార్జున, వాణి జగన్నాథ్‌రెడ్డి, అప్పారావు, ముల్లంగి నారాయణస్వామి, లక్ష్మిరెడ్డి, మహేంద్ర, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరండి: కాలవ భరత్

రాయదుర్గంరూరల్: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నామినేషన్ 24వ తేదీన వేస్తున్నందున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిమందిగా తరలివచ్చి విజయవంతం చేయాలని తనయుడు కాలవ భరత్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, వన్నూరు స్వామి, మల్లేశప్ప, టీడీపీ నాయకులు భోజరాజు, కాటా వెంకటేశులు, డాక్టర్ రామస్వామి, మాజీ జడ్పీటీసీ విజయకుమార్, పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్: నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు రేపు అనగా 24వ తేదీన రాయదుర్గంలో నామినేషన్ వేస్తున్నారని, కార్యక్రమానికి పార్టీ నాయకులు భారీ ఎత్తున తరలిరావాలని జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, కన్వీనర్ హనుమంత రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు.

15 కుటుంబాలు టీడీపీలో చేరిక

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 22: స్థానిక నివాసంలో సోమవారం యాడికి మండలం రాయలచెరువు గ్రామ వైసీపీకి 15కుటుంబాలు మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరాయి. పార్టీలో చేరిన వారికి జేసీ పీఆర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ప్రజలను మోసగించిన వైసీపీ ప్రభుత్వం

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్


ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కేశవ్

విడపనకల్లు, ఏప్రిల్ 22: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని టీడీపీ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. మండలంలోని డోనేకల్లు, కడదరబెంచి, గడేకల్లు, ఎన్ తిమ్మాపురం, అంచనహాలు, పాలికి గ్రామాల్లో ఆయన సోమవారం రోడ్డుషో నిర్వహించారు. గడేకల్లు గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళలు వైఎస్ఆర్ ఆసరా రాలేదని కేశవ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్దేశపూర్వకంగానే ఓసీ మహిళలుకు ఆసరా డబ్బులు వేయలేదన్నారు. దీనిపై కేశవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని మహిళలు అందర్నీ మోసం చేశాడని, ఉత్తుత్తి బొటన్ నొక్కి మహిళలకు ఆసరా డబ్బులు వేస్తున్నానని వంచించారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల్లో ప్రతి మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తునటుట్ల తెలిపారు. ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఆలోచించి టీడీపీకి ఓటు వేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. బీజేపీ, జనసేన, నాయకులు, టీడీపీ మండల కన్వీనర్ చిన్న మారయ్య, మాజీ ఎంపీపీ, లాయర్ ప్రతాప్ నాయుడు, భీమలింగప్ప చౌదరి, ఎం శ్రీనివాసులు, డీ దేవేంద్రప్ప, ధర్మరాజు, సంజీవ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

బెళుగుప్ప: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ తనయులు విక్రమ్ సింహా, విజయ్ సింహా ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం వారు బెళుగుప్పలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై విస్తృత ప్రచారం చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పుట్లూరు, ఏప్రిల్ 22: మండలంలోని చాలవేముల గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న శంకర్‌రెడ్డిని అరెస్ట్‌చేసినట్లు సోమవారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడిచేయడంతో 27మద్యం బాటిళ్లను అతనివద్ద నుంచి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 22: మండలంలోని గోవిందవాడ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గోవిందవాడ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,100 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పామిడి: పట్టణంలోని పీ కొత్తపల్లి రోడ్డు మామిడితోటలో పేకాడుతున్నారని సమాచారం రావడంతో తన సిబ్బందితో రాత్రి దాడి జరిపి తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ. 80,190 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంతా డ్రామా..!

- **ఆదివారం వైసీపీకి ప్రచారం చేసిన యానిమేటర్**
- **సోమవారం వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖ**

యాడికి, ఏప్రిల్ 22: ఎన్నికల నిబంధన మేరకు సస్పెండ్ చేస్తే తనపై మచ్చపడుతుందని వైకేపీ యానిమేటర్ పెద్ద డ్రామానే నడిపినట్లు చర్చ జరుగుతోంది. యాడికి మండలం పెద్దపేట గ్రామానికి చెందిన శివశక్తి గ్రామైఖ్య సంఘం యానిమేటర్ లక్ష్మిదేవి ఆదివారం వైసీపీ తరపున ప్రచారం నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోమవారం సోషల్‌మీడియాలో వచ్చాయి. ఇది పత్రికలకు వస్తే అధికారులు సస్పెండ్ చేస్తారని, ఇది తనపై మచ్చ పడుతుందని గ్రహించింది. సోమవారం ఉదయం తాను వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు వైకేపీ ఏపీఎంకు రాజీనామా లేఖ అందించారు. దానిని వెంటనే ఆమోదిస్తూ ఏపీఎం చంద్రశేఖర్ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై ఏపీఎంను వివరణ కోరడానికి ఫోన్ ద్వారా సంప్రదించగా స్విచాఫ్ అని రావడం గమనార్హం.